ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
అనకాపల్లి
జిల్లా వార్తలు
శుక్రవారం 10 జనవరి 2025





విద్యుద్దీప కాంతుల్లో నక్కపల్లి మండలం ఉపమాక వెంకన్న క్షేత్రం

ముక్కోటి ఏకాదశికి ముస్తాబైన సింహగిరి



సింహగిరిపై స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి పూర్తయిన ఏర్పాట్లు

- నేటి ఉదయం 5 నుంచి 10.30 వరకూ ఉత్తర ద్వారంలో అప్పన్న దర్శనం
- ఆర్జిత సేవలన్నీ రద్దు

సింహాచలం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి శుక్రవారం ఉత్తర ద్వారంలో వైకుంఠవాసునిగా దర్శనం ఇవ్వనున్నారు. తెల్లవారుజామున ఒంటి గంట నుంచి ఉదయం ఐదు గంటల వరకు సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధన, అయ్యవారి సేవ, ఉత్తర ద్వారంలో ప్రత్యేక పూజలు, ఉత్తర రాజగోపురంలో స్వామికి విశేష అలంకరణ వంటివి నిర్వహిస్తారు. అనంతరం 5 గంటల నుంచి ఉదయం 10.30 గంటల వరకు ఉత్తర రాజగోపురంలో ఏర్పాటుచేసిన పుష్పవేదిక పైనుంచి భక్తులకు వైకుంఠవాసుడి అలంకారంలో శేషపాన్పుపై స్వామి వారు దర్శనమిస్తారు. 12 గంటల నుంచి సింహగిరి మాడవీధుల్లో తిరువీధి ఉత్సవం ఉంటుంది. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు మహా నివేదన. ఈ సమయంలో భక్తులకు ఆలయంలో స్వామివారి దర్శనాలు లభించవు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు భక్తులకు దర్శనాలు లభిస్తాయి. శుక్రవారం అంతరాలయ దర్శనం, రాజగోపుర ప్రవేశాలను పూర్తిగా నిషేధించామని దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి చెప్పారు. సింహగిరిపై తెల్లవారుజామున మూడు గంటల నుంచి రూ.500 ఉత్సవ ప్రత్యేక దర్శన టికెట్లు ప్రత్యేక కౌంటర్లలో విక్రయిస్తారు. సుమారు లక్ష లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేసినట్టు ఆయన తెలిపారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తర రాజగోపురంతో పాటు ఆలయంలో పలు ప్రాంతాలను వివిధ రకాల పుష్పమాలికలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

నేడే వైకుంఠ ఏకాదశి

ఉత్తర ద్వారంలో ఉపమాక వెంకన్న దర్శనానికి ఏర్పాట్లు




ఉపమాక కొండదిగువన ఆలయంలో పుష్పాలంకరణ

వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు జిల్లాలోని వైష్ణవ క్షేత్రాలన్నీ ముస్తాబయ్యాయి. శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వారంలో స్వామివారి దర్శనం కల్పించేందుకు ఆలయాల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రాచీన పుణ్యక్షేత్రమైన నక్కపల్లి మండలం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయం వైకుంఠ ఏకాదశికి ముస్తాబైంది. స్వామి వారు ఈ ఒక్క రోజుమాత్రమే శ్రీరంగనాథుడి అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. వైకుంఠ ఏకాదశి రోజు ఉత్తర ద్వారం నుంచి స్వామిని దర్శించుకోవడానికి ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయంలో లోపల పుష్పాలంకరణ చేశారు.

పారిశ్రామిక విప్లవం

జిల్లాకు ఇంధన, ఫార్మా, ఉక్కు రంగాల్లో పలు పరిశ్రమలు

- ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు పెద్ద ఎత్తున పెట్టుబడులు
- వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- పూడిమడక వద్ద గ్రీన్ హైడ్రోజన్ హబ్
- ప్రభుత్వ రంగంలో మొట్టమొదటి హరిత ఇంధన ప్రాజెక్టు
- రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడులు
- రోజూ 1,500 టన్నుల గ్రీన్ హైడ్రోజన్, 7,500 టన్నుల ఇతర హరిత ఉత్పత్తులు
- ఏటా 2.5 మిలియన్ టన్నుల గ్రీన్ కెమికల్స్ తయారీ
- 57 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్



పూడిమడక వద్ద ఏర్పాటు కానున్న గ్రీన్ హైడ్రోజన్ హబ్ నమూనా

- 2 వేల ఎకరాల్లో రూ.1,876 కోట్లతో మౌలిక సదుపాయాలు
- రూ.14 వేల కోట్ల పెట్టుబడులతో ఫార్మా కంపెనీలు
- 30 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

అచ్యుతాపురం/ నక్కపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పరిశ్రల హబ్‌గా మారుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలో పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సహాయ, సహకారాలు అందిస్తున్నది. ఇంధన, ఉక్కు, ఔషధ రంగాల్లో లక్షల కోట్ల రూపాయల పెట్టుబడితో పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటు చేయాడానికి ప్రభుత్వ రంగ, ప్రైవేటు సంస్థలు ముందుకు వస్తున్నాయి. అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద రూ.1.85 లక్షల కోట్లతో ఏర్పాటు చేయనున్న గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కు, నక్కపల్లి మండలంలో సుమారు 16 వేల కోట్ల రూపాయలతో ఏర్పాటు కానున్న బల్క్ డ్రగ్ పార్క్‌కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశాఖ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఐదారేళ్ల కాలంలో నిర్మాణం పూర్తయ్యే ఈ పరిశ్రమల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 90 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇక నక్కపల్లి మండలంలో ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ ఇండియా కలిసి జాయింట్ వెంచర్ ప్రాజెక్టు కింద రూ.1,47,162 కోట్ల భారీ పెట్టుబడితో తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పచ్చజెండా ఊపింది. రెండు దశల్లో నిర్మించే ఈ ప్రాజెక్టులో 60 వేల మందికి ఉపాధి లభిస్తుంది. 2029 జనవరి నాటికి మొదటి దశ, 2033కల్లా రెండో దశ పూర్తి చేయాలన్నది లక్ష్యం.



నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు కేటాయించిన భూమి ఇదే..

గ్రీన్ హైడ్రోజన్ హబ్‌తో హరిత ఇంధన విప్లవం

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద సుమారు పదేళ్ల క్రితం థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు కోసం ఎన్‌టీపీసీ సేకరించిన భూమిలో గ్రీన్ హైడ్రోజన్ హబ్ నిర్మించనున్నారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో ఇది ముఖ్యమైన మైలురాయి కానున్నది. ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్- న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎన్ఆర్ఈడీసీఏపీ) కలిసి దీనిని ఏర్పాటు చేస్తున్నాయి. ప్రభుత్వ రంగం (నేషనల్ గ్రీన్ హైడ్రో మిషన్)లో ఇది మొట్టమొదటి హరిత ఇంధన ప్రాజెక్టు. మొత్తం 1,600 ఎకరాల్లో రూ.1.85 లక్షల కోట్లతో రెండు దశల్లో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ను నిర్మిస్తారు. ఇందులో 300 ఎకరాల్లో 25 పారిశ్రామిక మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు (అనుబంధ), మరో 300 ఎకరాల్లో మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్, రోడ్లు, పారిశ్రామిక కేంద్రాలు, విద్యుత్తు, నీరు, వ్యర్థాల శుద్ధి ప్లాంట్, డీశాలినేషన్ ప్లాంట్, ఓడరేవు తదితర వాటిని

... మిగతా 6వ పేజీలో

వేంకటేశ్వరస్వామి అంటే అతనికి ఎంతో భక్తి

ఏటా నాలుగైదుసార్లు తిరుమల వెళుతుంటారు

- వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనానికి వెళ్లి తిరిగిరాని లోకాలకు..
- తిరుపతి తొక్కిసలాటలో పెదబొడ్డేపల్లి వాసి మృతి



బొడ్డేటి నాయుడుబాబు (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వెంకన్నకు పరమ భక్తుడైన అతను.. కలియుగ దైవమైన వేంకటేశ్వరస్వామి సన్నిధానంలోనే అసువులు బాశాడు. బుధవారం రాత్రి తిరుపతిలో శ్రీవారి వైకుంఠ ఏకాదశి దర్శనం టోకెన్లు జారీ కౌంటర్ల వద్ద జరిగిన తొక్కిసలాటలో నర్సీపట్నం మునిసిపాలిటీ పెదబొడ్డేపల్లి బీసీ కాలనీకి చెందిన బొడ్డేటి నాయుడుబాబు (54) మృతి చెందడంతో ఇక్కడ విషాదఛాయలు అలముకున్నాయి. బోర్ వెల్ మెకానిక్‌గా పనిచేస్తున్న నాయుడుబాబుకు భార్య మణికుమారి, కుమార్తె సునీత ఉన్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన తిరుమలలో వేంకటేశ్వర స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కోసం భార్యతోపాటు తన స్నేహితుడైన చెట్టుపల్లికి చెందిన కరణం సత్యనారాయణ, అతని భార్య సంతోషితో కలిసి మంగళవారం ఇక్కడి నుంచి తిరుపతి బయలుదేరి వెళ్లారు. వైకుంఠ ఏకాదశి దర్శనం టోకెన్ల కోసం బుధవారం రాత్రి తిరుపతిలో క్యూలైన్‌లో నిల్చున్నప్పుడు జరిగిన తొక్కిసలాటలో నాయుడుబాబు కింద పడిపోవడంతో వెనుక వున్న వారు ఆయన మీద పడడంతో ఊపిరి ఆడక మృతిచెందాడు. ఈ సమాచారం బుధవారం రాత్రి పది గంటల సమయంలో నర్సీపట్నంలో వుంటున్న ఆయన అన్న, రిటైర్డ్ ఎంఈవో బొడ్డేటి వెంకటరమణకు అందింది. ఈ సంఘటనతో

... మిగతా 6వ పేజీలో

ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీ



సంక్రాంతి రద్దీని సొమ్ము చేసుకుంటున్న నిర్వాహకులు

- సాధారణ రోజుల్లో కంటే రెట్టింపు మొత్తం వసూలు
- హైదరాబాద్ టు విశాఖపట్నం చార్జీ సాధారణ రోజుల్లో రూ.1500-రూ.2,000
- అదే 10న రూ.3,200, 14న రూ.5,720
- 16, 17 తేదీల్లో విశాఖ-విజయవాడ ఏసీ స్లీపర్ రూ.1500-2,500
- పట్టించుకోని రవాణా శాఖ అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండుగ రద్దీని ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. డిమాండ్‌ను ఆసరాగా తీసుకుని టికెట్ ధరలను 50 నుంచి వంద శాతం పెంచేశారు. రవాణా శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రైవేటు ట్రావెల్స్ ఆపరేటర్ల దందాకు అంతూపొంతూ లేకుండా పోతోంది.

తెలుగు వారికి అత్యంత ప్రధానమైన పండుగల్లో సంక్రాంతి ఒకటి. విద్య, ఉద్యోగం, ఉపాధి అవసరాల నిమిత్తం ఎక్కడెక్కడో స్థిరపడినవారంతా సంక్రాంతికి తమ స్వస్థలాలకు వస్తారు. పండుగ పూర్తయిన తర్వాత తిరిగి వెళతారు. దీంతో సంక్రాంతి ముందు, తరువాత రైళ్లు, బస్సులకు రద్దీ ఎక్కువగా ఉంటుంది. రైళ్లలో ప్రయాణానికి మూడు నెలల ముందే రిజర్వేషన్ చేసుకునేందుకు వీలుంటుంది. అక్టోబరులో రిజర్వేషన్ స్లాట్ ఓపెన్ అయిన గంటల వ్యవధిలోనే టిక్కెట్లన్నీ బుక్ అయిపోతుంటాయి. రైళ్లలో టిక్కెట్లు దొరకనివారు, ప్రయాణం ఎప్పుడనే దానిపై ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోలేనివారంతా బస్సులపై ఆధారపడతారు. చాలామంది ప్రైవేటు ట్రావెల్స్‌లో ప్రయాణానికి మొగ్గుచూపుతారు. దీంతో సంక్రాంతి సీజన్‌లో ప్రైవేటు ట్రావెల్స్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. దీనిని ఆసరాగా తీసుకుని నిర్వాహకులు టిక్కెట్ రేట్లు భారీగా పెంచేస్తున్నారు. ఈనెల ఏడో తేదీ వరకు ఉన్న టికెట్ చార్జీల కంటే 50 శాతం నుంచి వంద శాతం పెంచేశారు. ముఖ్యంగా హైదరాబాద్, విజయవాడ నుంచి నగరానికి వచ్చేవారు ఎక్కువగా ఉండడంతో ఆయా మార్గాల్లో టిక్కెట్లను భారీగా పెంచేశారు. ఈనెల ఒకటిన హైదరాబాద్ నుంచి విశాఖపట్నం రావాలంటే ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో టికెట్ రూ.1500 నుంచి రూ.రెండు వేల మధ్య ఉండేది. అదే ఈ నెల పదిన టికెట్ రేట్లను పరిశీలిస్తే రూ.3,200, 14వ తేదీ నాటికి ఏకంగా రూ.5,720 వరకూ ఉంది. తిరుగు ప్రయాణాల విషయానికి వస్తే సాధారణ రోజుల్లో విశాఖ నుంచి హైదరాబాద్‌కు రూ.1,500 నుంచి రూ.రెండు వేల మధ్యన ఉండగా, సంక్రాంతి తరువాత వారం రోజుల వరకూ ప్రైవేటు ట్రావెల్స్‌లో టిక్కెట్ చార్జీలు భారీగా ఉన్నాయి. డిమాండ్‌ను బట్టి రూ.ఆరు వేల వరకు వసూలుచేస్తున్నారు.

విశాఖపట్నం నుంచి విజయవాడ వెళ్లేందుకు ఈనెల ఏడో తేదీ వరకు ఏసీ స్లీపర్ సీటు రూ.1,200, నాన్ ఏసీ స్లీపర్ రూ.900, ఏసీ చైర్

... మిగతా 6వ పేజీలో

మహిళా రైతు దారుణ హత్య



వబలరెడ్డి నరసమ్మ (ఫైల్ ఫొటో)

- పొలంలో ఒంటరిగా ఉన్నప్పుడు బంగారం కోసం గొంతు కోసి అఘాయిత్యం
- చోడవరం మండలం లక్కవరంలో దారుణం



మహిళ హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి


చోడవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కవరం గ్రామ శివారు చెరకు తోటలో మహిళ దారుణ హత్యకు గురైంది. మహిళ గొంతు కోసిన గుర్తు తెలియని దుండగులు.. ఆమె మెడలో, చెవులకు ఉన్న బంగారు ఆభరణాలు దోచుకుపోయారు. చోడవరం- దేవరాపల్లి రహదారికి సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. లక్కవరం గ్రామానికి చెందిన వబలరెడ్డి నరసింహమూర్తి భార్య నరసమ్మ(60) పశువులకు గడ్డి కోసేందుకు గురువారం సాయంత్రం మూడు గంటల సమయంలో పొలానికి వెళ్లింది. కొంతసేపటి తరువాత గడ్డి తెచ్చేందుకు నరసింహమూర్తి పొలానికి వెళ్లాడు. అయితే భార్య అక్కడ కనిపించకపోవడంతో పొలంలో వెతికాడు. పక్కనే వున్న చెరకు తోటలో చీర కనిపించడంతో అటుగా వెళ్లి చూడగా నరసమ్మ రక్తపు మడుగులో విగతజీవిగా కనిపించింది. దీంతో బిగ్గరగా కేకలు వేయడంతో సమీపంలోని పొలాల్లో వున్న రైతులు అక్కడకు వచ్చారు. నరసమ్మ గొంతు కోసి వుంది. ఆమె మెడలో, చెవులకు వుండాల్సిన నాలుగు తులాలకుపైగా బంగారు వస్తువులు కనిపించలేదు. పొలంలో పట్టపగలు మహిళ హత్యకు గురికావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇదే తరహాలో బంగారం కోసం మహిళను హత్య చేసిన ఘటన గత ఏడాది గోవాడ శివారు ప్రాంతంలో

... మిగతా 6వ పేజీలో

వేటజంగాలపాలెంలో అక్రమ మైనింగ్

ఈసీలు లేకుండానే రాయి క్వారీల్లో తవ్వకాలు

- రేయింబవళ్లు భారీ వాహనాలతో తరలింపు
- కలెక్టర్, తహసీల్దారు హెచ్చరిక బోర్డుల సాక్షిగా రవాణా
- పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు
- మామూళ్లు పుచ్చుకుంటూ అక్రమార్కులకు సహకారం?



వేటజంగాలపాలెంలో రాత్రిపూట సైతం టిప్పర్లలోకి రాయిని లోడింగ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్లు

కొత్తూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ సంపదను కాపాడాల్సిన అధికారులే అక్రమార్కులతో కుమ్మక్కు అవుతున్నారు. వారి నుంచి మామూళ్లు పుచ్చుకుంటూ సహజ సంపద దోపిడీకి సహకరిస్తున్నారు. దీంతో తవ్వకాలకు అనుమతులు లేని క్వారీల నుంచి పగలు, రాత్రి అన్న తేడా లేకుండా భారీ వాహనాలతో నల్లరాయిని తరలించుకుపోతున్నారు. అయినా సరే ఎక్కడా తనిఖీలు చేపట్టడంలేదు.



వేటజంగాలపాలెంలో కలెక్టర్, తహసీల్దారు పేరుతో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు సాక్షిగా నల్లరాయిని రవాణా చేస్తున్న టిప్పర్

అనకాపల్లి మండలం వేటజంగాలపాలెం 84 సర్వే నంబరులో 36, కుంచంగి 316 సర్వే నంబరులో ఎనిమిది రాయి క్వారీలు వున్నాయి. మైనింగ్ అధికారులు క్వారీల్లో రాయి తవ్వకాలు, రవాణాకు ప్రస్తుతం ఒక్క క్వారీకి కూడా ఈసీ ఇవ్వలేదు. అయినా సరే పలు క్వారీల్లో రాయి కోసం పెద్ద ఎత్తున పేలుళ్లు జరుపుతున్నారు. ఎక్స్‌కవేటర్లతో రాళ్లను భారీ డంపర్ లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లలోకి లోడింగ్ చేస్తున్నారు. ఇక్కడి నుంచి రాంబిల్లి మండలంలో ఎన్ఏఓబీ పనులకు తరలిస్తున్నారు. ఈసీలు లేకుండానే రేయింబవళ్లు నల్లరాయిని రవాణా చేస్తుండడం, ఎక్కడా మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు పట్టుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. నల్లరాయిని రవాణా చేసే వాహనాలతో కేబీ రోడ్డు నిత్యం రద్దీగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని

... మిగతా 6వ పేజీలో

వేములపూడి కేజీబీవీలో అదుపులోకి రాని అతిసార

- మూడు రోజుల్లో 37 మందికి అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థితో మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయభాస్కర్

నర్సీపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపూడి కేజీబీవీలో అతిసార అదుపులోకి రావడంలేదు. మూడు రోజుల్లో 37 మంది బాలికలు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు

... మిగతా 6వ పేజీలో

నేడు ఉత్తర ద్వారంలో జగన్నాథస్వామి దర్శనం



అచ్యుతాపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిమడక సముద్ర తీరంలో గల సుభద్ర, బలరామ సహిత జగన్నాథస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ప్రధానార్చకులు పులఖండం గోపాలాచార్యులు తెలిపారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం తెల్లవారు జాము నుంచి స్వామివారికి అర్చన, అభిషేకాలుంటాయన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

బాధితురాలికి జనసేన ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న జనసేన నాయకులు గణేశ్, బాబూరావు

ఎస్‌.రాయవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురంలో అనారోగ్యం తో బాధపడుతున్న ప్రగడ బాబూజీ కుమార్తెకు జనసేన పార్టీ అండగా నిలిచింది. స్థానిక జనసేన పార్టీ నాయకుడు శానాపతి బాబూరావుకు ఈ విషయం తెలియడంతో పలువురు నుంచి విరాళాలు సేకరించారు. ఈ విధంగా సేకరించిన రూ. 67,500 నగదును గురువారం జనసేన పార్టీ నాయకుడు ప్రసాదుల గణేష్, బాబూరావు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో అప్పికొండ బుజ్జి, శానాపతి లోవరాజు, వంగలపూడి నానాజీ, జంప శ్రీనివాస్, రాము, చందు, రాజు, శ్రీరామ్‌కుమార్ పాల్గొన్నారు.

మోదీని కలిసిన కాశీశ్వరరావు



మోదీకి నమస్కారం చేస్తున్న కాశీశ్వరరావు

మునగపాక, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోదీతో పరిచయ వేదిక ద్వారా కలిసే అవకాశం లభించిందని బీజేపీ మండల అధ్యక్షుడు మళ్ల కాశీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూలో ప్రధాని సభ ముగిసిన తరువాత పరిచయ వేదిక ద్వారా మోదీని కలిసేందుకు ఎంపీ సీఎం రమేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు అవకాశం కల్పించారన్నారు.

విద్యార్థులు సన్మార్గంలో నడవాలి : సీఐ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నరసింగరావు

రాంబిల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా క్రమశిక్షణతో సన్మార్గంలో నడవాలని సీఐ నరసింగరావు హితవు పలికారు. గురువారం మండలంలోని వాడనర్సాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలు, మత్తుపానీయాల పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తుపానీయాలకు ఆకర్షితులు కాకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కారే రామారావు, మాజీ సర్పంచ్ చింతకాయల ఎర్రయ్య, సూరాడ నూకరాజు, ఎస్‌.అప్పలరాజు, కారే నాని, వాసపల్లి తేజ, రాజు పాల్గొన్నారు.

పాడి రైతులకు సంక్రాంతి బోనస్ పంపిణీ



రైతులకు సంక్రాంతి బోనస్ పంపిణీచేస్తున్న మేనేజర్ శేషు

అచ్యుతాపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పాడిరైతుల ఆర్థికాభివృద్ధే తమ ధ్యేయమని హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కుంభసు శేషు అన్నారు. గురువారం మండలంలోని ఎర్రిరెడ్డి పాలెంలో 26 మంది పాడి రైతులకు రూ.1.55 లక్షల సంక్రాంతి బోనస్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.రెండు లక్షలు, సహజ మరణానికి రూ.50వేలు బీమా ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో అప్పారావు, నర్సింగరావు, అప్పలనాయుడు, పైడిరాజు, నాగరాజు పాల్గొన్నారు.


'యూటీఎఫ్ మోడల్ పేపర్లు భేష్'



మోడల్ పేపర్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచడానికి తమ మోడల్ పేపర్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు మద్దెల నానాజీ అన్నారు. యూటీఎఫ్ తయారుచేసిన టెన్త్ మోడల్‌పేపర్లను గురువారం ఆయన పలు ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొంతకాలంగా తాము మోడల్ పేపర్లను నిపుణులైన ఉపాధ్యాయులతో తయారుచేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రవివర్మ, మారిశెట్టి వెంకట అప్పారావు, దర్శిరెడ్డి రాజు, షేక్ నబీల, జీవన్ ప్రకాష్, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

సప్పరం వాహనంపై శ్రీనివాసుడు



నక్కపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం సప్పరం వాహనంపై శ్రీనివాసుడి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని, పల్లకిలో గోదాదేవి అమ్మవారిని అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. అనేక మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అధికారులు, అర్చకులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

కల్కి అవతారంలో పాండురంగడు



పాయకరావుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాండురంగస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా దశావతారాల్లో ఆఖరి అవతారంగా గురువారం పాండురంగస్వామి వారు కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సుప్రభాతసేవ, విశేష పూజల అనంతరం ప్రధానార్చకులు కృష్ణస్వామి స్వామివారిని కల్కి అవతారంలో అలంకరించారు. ఆలయ ఈఓ కె.దివ్యతేజ, భక్తులు స్వామివారి దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని శుక్రవారం పాండురంగస్వామి భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించనున్నామని ఆలయ ప్రధానార్చకులు యుక్తకృష్ణస్వామి తెలిపారు.

ఇంటర్వ్యూ..

పన్నులు వసూలుపై దృష్టి

బీజేవీ ప్రసాదబాబు, కమిషనర్, ఎలమంచిలి మునిసిపాలిటీ

(ఆంధ్రజ్యోతి/ఎలమంచిలి)



ప్రశ్న: మునిసిపాలిటీ అభివృద్ధికి తీసుకునే చర్యలేమిటి..?

జవాబు: ఎలమంచిలి మునిసిపాలిటీని ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాను.

ప్రశ్న: మునిసిపాలిటీ ఆదాయ వనరులు పెంచేందుకు తీసుకుంటున్న చర్యలు?

జవాబు: అన్ని రకాల పన్నులు వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నాం.

ప్రశ్న: శానిటేషన్ మెరుగుకు తీసుకునే చర్యలేమిటి..?

జవాబు: వంద శాతం ఇంటింట చెత్త సేకరణకు చర్యలు తీసుకున్నాం. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ప్రోత్సాహంతో త్వరలో ఆధునిక కాంపోస్టర్ రానుంది. వచ్చిన వెంటనే సేకరించిన చెత్తను కాపులుప్పాడ వద్ద ఉన్న వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌కు తరలిస్తాం.

ప్రశ్న: పార్కుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేమిటి?

జవాబు: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పార్కులను అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు చేపట్టం. ఇప్పటికే కొమ్మాయి గుండం వద్ద ఉన్న పార్కులో కొన్ని అభివృద్ధి పనులు చేస్తున్నాం.

ప్రశ్న: యానాది కాలువ ఆధునీకరణ పరిస్థితి..?

జవాబు: పట్టణంలోని నివాస ప్రాంతాల మీదుగా వెళుతున్న యానాది కాలువ ఆధునికీకరణకు రూ.7.4 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. ఇప్పటికే రూ.3 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

ప్రశ్న: పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ కవర్ వినియోగం సాగుతోంది?

జవాబు: మునిసిపాలిటీలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగం లేకుండా తమ సిబ్బంది నిత్యం దాడులు చేస్తున్నారు. ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఉపమాకలో ముక్కోటి ఏకాదశికి ముమ్మర ఏర్పాట్లు



ఉత్తర ద్వారం గుండా దర్శనమిచ్చే ఉపమాక వెంకన్న నిజరూపం, సిద్ధమైన క్యూ లైన్లు

నక్కపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశికి ఉపమాక వేంకటేశ్వరస్వామి దేవస్థానం ముస్తాబైంది. ప్రతి ఏటా శ్రీరంగనాథుడి అవతారంలో ముక్కోటి ఏకాదశి రోజు మాత్రమే ఉపమాక వెంకటేశ్వరుడు భక్తులకు అభూర్వ దర్శనమిస్తారు. దేశంలో ఎక్కడా లేని విధంగా స్వామివారు కల్కి అవతారంలో గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తమయ్యారు. ఏడాది పొడవునా ఉపమాక వెంకన్న నిజరూపం ఉత్తర ద్వార దర్శనంలోనే భక్తులకు దర్శనమివ్వడం ప్రత్యేకతగా చెప్పొచ్చు. వైకుంఠ ఏకాదశి రోజు ఉత్తర ద్వారం నుంచి స్వామిని దర్శించుకోవడానికి ఉమ్మడి విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు ఉపమాక తరలివస్తారు. ఇందుకు సంబంధించి టీటీడీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నారు. ఆలయ ప్రధాన రాజగోపురం, ఆలయ ప్రాంగణాలు విద్యుద్దీపాలంకరణలో కాంతులీనుతున్నాయి. ఆలయ ఆస్థాన మండపం చుట్టూ పుష్పాలంకరణ చేశారు. ఇందుకోసం ఆలయంలో క్యూ లైన్లు కూడా సిద్ధం చేశారు. కాగా శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు కొండపై వెలిసిన స్వామివారి నిజరూపానికి అర్చకులు పంచామృతాభిషేకాలు చేస్తారు. వైకుంఠ ఏకాదశి ఒక్కరోజునే ఉపమాక వేంకటేశ్వరుడు శ్రీరంగనాథుడిగా దర్శనమిస్తారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు

నక్కపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి, ఎస్‌.రాయవరం, పాయకరావుపేట మండలాలకు చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామరాజు మాట్లాడుతూ.. ఉపాధి పనులు చేపట్టే ఒక్కో కూలీకి రూ. 300 కూలి వచ్చే విధంగా మార్కింగ్ ఎలా ఇవ్వాలో శిక్షణ ఇచ్చారు. వ్యవసాయ అనుబంధ పనులుగా ఫాం పాండ్స్, పంట కాలువలు, సరిహద్దు కందకాలు, చెరువు పనులు చేయించాలని సూచించారు. శక్తి సంఘాలను బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ డి.ఎరకయ్య, ఏపీవో జి. నానిబాబు, ఏపీవో ఏ.భాగ్యలత పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు



ఎలమంచిలి రైల్వే స్టేషన్ రోడ్డు హైస్కూల్‌లో విద్యార్థినులతో కలిసి భోగి సంబరాలు చేస్తున్న టీచర్లు



పాయకరావుపేట రూరల్: పెదరాంభద్రపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం



కోటవురట్ల: పందూరు పాఠశాల రంగవల్లి వేస్తున్న విద్యార్థులు

ఎలమంచిలి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. జంపపాలెం హైస్కూల్, తులసీనగర్ హైస్కూల్, రైల్వే స్టేషన్ రోడ్డు జడ్పీ హైస్కూల్‌లో భోగి మంటలు, హరిదాసు, గంగిరెద్దు వేషాలు, పాలు పొంగించడం, సంప్రదాయ క్రీడలు నిర్వహించారు. ఉపాధ్యాయులు సంప్రదాయ పంచెకట్టులో అందరిని అలరించారు. ఈ ఉత్సవాల్లో ఎంఈవో మీనాక్షి పాల్గొన్నారు.

ఎస్‌.రాయవరంలో..

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయరీతిలో దుస్తులు ధరించారు. భోగి మంటలు, హరిదాసు వేషధారణలు వేశారు. ఆటపాటలతో సంబరాలు జరపడంతో గ్రామాల్లో ముందుగానే సంక్రాంతి వచ్చినట్టయింది. మండలంలోని పెట్టుగోళ్లపల్లి, ధర్మవరం అగ్రహారం, ఎస్‌.రాయవరం, తదితర గ్రామాల పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. రాజుపేట యూపీ స్కూల్,పందూరు, రాజుపేట, బోడపాలెం, కొడవటిపూడి పాఠశాలల ప్రాంగణాలు భోగి మంటలు, రంగవల్లులు, గొబ్బెమ్మలతో నిండిపోయాయి. చిన్నారులు హరిదాసు వేషధారణలో ఆకట్టుకున్నారు. హెచ్‌ఎంలు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలోని పెదరాంభద్రపురం జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం కోడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులను ధరించి భోగి మంట వేసి గొబ్బెమ్మలతో, హరిదాసు కీర్తనలు, నృత్యాలతో అలరించారు. విద్యార్థులు పాఠశాలలో అందమైన ముగ్గులు వేసి కొత్త శోభను తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే పాయకరావుపేట గౌతమ్ మోడల్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు.

నేడు పాటిపల్లి అహోబిల లక్ష్మీనృసింహస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ



అహోబిల లక్ష్మీనృసింహస్వామి కొలువైన కొండ (ఇన్‌సెట్‌లో) స్వామివారు

మునగపాక, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాటిపల్లి గ్రామంలో 16వ శతాబ్దం నాటి అయిదంగా ప్రాముఖ్యం పొందిన అహోబిల శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ ఈ నెల 10వ తేదీన జరుగనున్నదని ఉత్సవ నిర్వాహకుడు కొయిలాడ జగదీశ్ తెలిపారు. ఏటా ముక్కోటి ఏకాదశి రోజున గిరి ప్రదక్షిణను నిర్వహించడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. కొండపై కొలువైన శ్రీలక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4 గంటలకు గిరి ప్రదక్షిణ మొదలై మూలపేట, తోటాడ, నారాయుడుపాలెం ప్రధాన రోడ్డు మార్గం గుండా తిరిగి ఆలయం వద్దకు చేరుకుంటుందని చెప్పారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

అచ్యుతాపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ గురువారం విచారణ జరిపారు. మండలంలోని పెదపాడులో గాదం సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదుపై ఆయన గ్రామంలో విచారణ జరిపారు. మునగపాక మండలం నాగులాపల్లికి చెందిన పుట్టూరు మల్లేశ కులం పేరుతో దూషించాడని పెదపాడుకి చెందిన దళితుడైన గాదం సూరిబాబు ఈనెల ఐదున ఫిర్యాదు చేయడంతో డీఎస్పీ సత్యనారాయణ గురువారం విచారణ జరిపారు. ఆయన వెంట అచ్యుతాపురం ఎస్ఐ సుధాకర్ ఉన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం సాయిబాబా

ఎలమంచిలి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ సోమలింగపాలెం జడ్పీ హైస్కూల్‌లో 48 మంది పదో తరగతి విద్యార్థులకు గురువారం హెచ్‌ఎం బీవీఎస్. సాయిబాబా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఇదే స్కూలులో చదువుకున్న పూర్వ విద్యార్థి బొడేటి సూర్యప్రకాశరావు అందజేసిన మెటీరియల్ అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ పొలిమారశెట్టి నాగ విశ్వేశ్వరావు, నాయకులు కర్రి రూన్సీ, బి. ప్రసాద్, కర్రి స్వామి, ఉపాధ్యాయులు పిల్లా శ్రీనివాసరావు, కిషోర్, సంజీవ కుమార్, చక్రవర్తి, పద్మజ, ప్రసాద్ పాల్గొన్నారు.

చూచుకొండలో మేలుకొలుపు సమ్మేళనం

» పాల్గొన్న 12 గ్రామాల భక్తులు



మేలుకొలుపు సమ్మేళనంలో మాట్లాడుతున్న పార్థసారథి

మునగపాక, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చూచుకొండ గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన మేలుకొలుపు సమ్మేళనంలో 12 గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ అనకాపల్లి జిల్లా ప్రతినిధి పార్థసారధి మేలుకొలుపు విశిష్టత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో 600 మంది భక్తులు, ధర్మ ప్రచారకులు ఆడారి గంగాధర్, శ్రీను, వీర మహేష్, భజన బృందాల సభ్యులు పాల్గొన్నారు.

బస్సులో నుంచి జారి పడి విద్యార్థికి గాయాలు

మాకవరపాలెం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బస్సులో నుంచి జారిపడడంతో ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ దామోదరనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొండల అగ్రహారం గ్రామానికి చెందిన ఎస్.గోవింద్ నర్సీపట్నంలోని ఒక పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వెళ్లేందుకు గురువారం ఉదయం కొండల అగ్రహారంలో ఆర్టీసీ బస్సు ఎక్కాడు. అప్పటికే ప్రయాణికులతో బస్సు నిండిపోవడంతో గోవింద్ డోర్ వద్ద నిలుచున్నాడు. ఈ క్రమంలో బస్సు ఒక్కసారిగా ముందుకు కదలడంతో పట్టుతప్పి రోడ్డుపై పడిపోయాడు. చేతికి, తలకు గాయాలు అయ్యాయి. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. తలకు బలమైన గాయాలు కావడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కి తీసుకెళుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

గృహ నిర్బంధాలు, అరెస్టులపై సీపీఎం నిరసన



అరెస్టులను ఖండిస్తూ ఎలమంచిలిలో సీఐటీయూ నేతల ఆందోళన

ఎలమంచిలి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ప్రధాని సభ సందర్భంగా కార్మిక, రైతు, యువజన, వామపక్ష పార్టీల నాయకుల అరెస్టులు, గృహ నిర్బంధం వంటి చర్యలకు నిరసనగా గురువారం పట్టణంలో సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాలు ఆందోళన చేశాయి. ప్రధాని మోదీ విశాఖ స్టీల్ ప్లాంట్‌పై స్పష్టమైన ప్రకటన చేయకపోవడాన్ని వ్యతిరేకించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

ప్రధాని మోదీ విశాఖ పర్యటన సందర్భంగా అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలను నిరసిస్తూ సీపీఎం శ్రేణులు గురువారం అచ్యుతాపురం జంక్షన్‌లో ఆందోళన చేశాయి. ఈ సందర్భంగా సీపీఎం అచ్యుతాపురం కన్వీనర్ రొంగలి రాము మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరణ, సొంత గనులపై ప్రధాని ప్రకటన చేయకపోవడం ఉద్యోగులకు ద్రోహం చేసినట్లేనన్నారు. కార్యక్రమంలో కూండ్రపు సోమునాయుడు, తట్టా రాజు, గణేష్, వెంకట్, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన 8 మందిపై కేసు

నక్కపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజయ్యపేట వద్ద బల్క్‌డ్రగ్ పార్కుకు సంబంధించి బుధవారం ప్రధాని మోదీ వర్చువల్ శంకుస్థాపన చేసిన సందర్భంగా పోలీస్ విధులకు పలువురు ఆటంకం కల్పించారని ఎస్ఐ సన్నిబాబు చెప్పారు. నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు, యువకులను అదుపుకునే సమయంలో పోలీస్ విధులకు ఆటంకం కల్పించి, దౌర్జన్యానికి పాల్పడిన సీపీఎం నాయకులు సహ 8 మందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ సన్నిబాబు చెప్పారు.

నేడు 13 గ్రామాలకు పవర్ కట్

అచ్యుతాపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 13 గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె. రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌లైన్ల కింద చెట్లు నరికివేత పనులు చేపడుతున్నందున, ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం రెండు వరకు ఆవసోమవరం, ఆవరాజాం, దిమిలిపల్లి, అప్పన్నపాలెం, బంగారయ్యపేట, జేపీ అగ్రహారం, నారపాక, ఎరకన్నపాలెం, తట్టవానిపాలెం, రామన్నపాలెం, జగువాడ, దొప్పెర్ల, చిట్టిబోయినపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

జీడిచెట్లు నరికివేతపై ఫిర్యాదు

అచ్యుతాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తమ ఆధీనంలో ఉన్న జీడితోటలో చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని పూడిమడక మత్స్యకార కులపెద్దలు గురువారం తహసీల్దార్‌కి ఫిర్యాదు చేశారు. పూడిమడక సర్వే నంబరు 82, 83లో 80ఎకరాల్లో మంత్రి రామమూర్తికి జీడితోట ఉంది. దీని సంరక్షణ తోపాటు వచ్చే ఫలసాయం పూడిమడక కులపెద్దలే తీసుకుంటున్నారు. అయితే ఈ జీడితోటలోని చెట్లను కొందరు నరికి తరలిం చేస్తున్నారు. ఒక వాహనాన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జనార్దనకు చేపల తాతలు, మేరుగ కాసుబాబు, బొడిపల్లి కాసులు, బొద్దు జగ్గ, మంత్రి వెంకటరమణ, మైలపల్లి మసేనరావు, మంత్రి జగదీష్ ఫిర్యాదు చేశారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం

ఎస్‌. రాయవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో పెదరాయవరం రూరల్ ఫీడర్‌లో ఉన్న సోముదేవుపల్లి, పెనుగొల్లు, గెడ్డపాలెం ఏజీఎల్ లైన్‌తోపాటు ధర్మవరం గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజేశ్వర్ తెలిపారు. విద్యుత్ లైన్లపై ఉన్న చెట్లకొమ్మలు నరికి వేసేందుకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

పీఆర్‌టీయూ సంక్రాంతి సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ఎస్‌.రాయవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుమ్మలూరు జడ్పీ హైస్కూల్‌లో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఈనెల 11న నిర్వహించనున్న సంక్రాంతి సంబరాల పోస్టర్‌ను గురువారం నక్కపల్లి సీఐ రామకృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్ రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలంటూ న్యాయస్థానానికి...

▸ చీడిగుమ్మల బీసీ కాలనీలో పర్యటించిన ఆర్డీవో రమణ



గ్రామంలో హైస్కూల్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రమణ

గొలుగొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : నాలుగు గృహాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని నలుగురు కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఆర్డీవో వీవీ రమణ, స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరావు గురువారం సదరు గ్రామాన్ని పరిశీలించారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. మండలంలోని చీడిగుమ్మల బీసీ కాలనీలో ఏర్పాటైన హైస్కూల్‌కు ఆట స్థలంగా 2019లో అరవై సెంట్ల స్థలాన్ని కేటాయించారు. ఆ స్థలం మధ్యలో తమకు రోడ్డు ఏర్పాటు చేయాలని అదే కాలనీకి చెందిన కిల్లాడ అప్పలనాయుడు, తాతబ్బాయి, పెద్దినాయుడు, మర్రి చిన్నోడు కలిసి కోర్టును ఆశ్రయించారు. ఈ నాలుగు గృహాలకు ఉన్న రోడ్డును అదే కాలనీకి చెందిన కొంతమంది ఆక్రమించుకోవడంతో ఆర్డీవో పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాలుగు గృహాలకు రోడ్డు ఏర్పాటుపై పరిశీలించామన్నారు. పూర్తి రికార్డులను కోర్టుకు నివేదిస్తామని చెప్పారు. తదుపరి ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీ చైనులు, టీడీపీ నాయకులు కామిరెడ్డి గోవింద, హైస్కూల్ హెచ్‌ఎం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి పూర్వ విద్యార్థులు బాసట



బాధిత కుటుంబానికి నగదు డిపాజిట్ పత్రాన్ని అందిస్తున్న స్నేహితులు

కృష్ణాదేవిపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటకు చెందిన లక్కోజు అప్పలాచారి అనారోగ్యంతో గత నెల మృతిచెందారు. దీంతో అతనితో పదో తరగతి చదువుకున్న 1995-96 బ్యాచ్‌కు చెందిన స్నేహితులు ఆయన కుటుంబానికి బాసటగా నిలిచారు. ఈ మేరకు గురువారం పోస్టాఫీసులో రూ.40వేలు డిపాజిట్ చేసి ఆ పుస్తకాన్ని సదరు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలపర్తి సత్యనారాయణ, ఊడా రమేశ్, అల్లం నాగేంద్ర, లాలం అప్పలనాయుడు, లాలం రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నర్సీపట్నం వెంకునాయుడుపేట పాఠశాలలో..



గొలుగొండ : చీడిగుమ్మల హైస్కూల్‌లో...



నాతవరం పాఠశాలలో...

పాఠశాలల్లో పండుగ

▸ ఆనందోత్సాహాల నడుమ సంక్రాంతి సంబరాలు



మాకవరపాలెం : తూటిపాల పాఠశాలలో..

నర్సీపట్నం, జనవరి 9(ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబరాలను పలు పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని వెంకునాయుడుపేట ఎంపీపీ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆవరణను రంగవల్లులు, గొబ్బెమ్మలతో అలంకరించారు. అరటి చెట్లు, మామిడి ఆకులు తోరణాలు కట్టారు. ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థుల సంప్రదాయ దుస్తులు ధరించి హాజరయ్యారు. హెచ్‌ఎం డీజీనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొలుగొండ/కృష్ణాదేవిపేట : మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. చీడిగుమ్మల, జోగంపేట, కొత్తఎల్లవరం, పాకలపాడు, కొత్తమల్లంపేట హైస్కూళ్లలో విద్యార్థులు సాంప్రదాయ దుస్తులను ధరించి హాజరయ్యారు. వివిధ వేషధారణలతో అలరించారు. భోగిమంట వద్ద కేరింతలు కొట్టారు. ప్రధానోపాధ్యాయులు ఆనంద్, సరోజిని, కుమారి తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఏఎల్‌పురం, పాత కృష్ణాదేవిపేట, కొంగశింగి, లింగంపేట, గింజర్తి, కృష్ణాదేవిపేట, చోద్యం ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాల్లో, సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, శ్రీను, సత్యనారాయణ, ఉపాధ్యాయులు టీవీ రమణ, లోచల రమేష్, రామరాజు, రామ్‌కుమార్, లవకుశ తదితరులు పాల్గొన్నారు.



గొలుగొండల మండలం ఏఎల్‌పురం హైస్కూల్‌లో భోగిమంట వద్ద కోలాహలం

మాకవరపాలెం : మండలంలోని పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలను ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో మరింత ఘనంగా జరిపారు. వివిధ వేషధారణలతో విద్యార్థులు అలరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాతవరం : మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం సందడి వాతావరణం నెలకొంది. సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ప్రధానంగా నాతవరం శాంతినికేతన్ పాఠశాలతో పాటు పలు పాఠశాలల్లో విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, మండలంలో హరిదాసుల కోలాహలం నెలకొంది. పలువురు గతానికి భిన్నంగా ద్విచక్ర వాహనాలపై ముందు మైక్ పెట్టి పాటలు పాడుకుంటూ రావడాన్ని అంతా ఆసక్తిగా తిలకించారు.

బస్సులో నుంచి జారిపడి విద్యార్థికి గాయాలు

మాకవరపాలెం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బస్సులో నుంచి జారిపడడంతో ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ దామోదరనాయుడు తెలిపిన వివరాలిలా వున్నాయి. కొండల అగ్రహారం గ్రామానికి చెందిన ఎస్.గోపీచంద్ నర్సీపట్నంలోని ఒక పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వెళ్లేందుకు గురువారం ఉదయం కొండల అగ్రహారంలో ఆర్టీసీ బస్సు ఎక్కాడు. అప్పటికే ప్రయాణికులతో బస్సు నిండిపోవడంతో గోపీచంద్ డోరు వద్ద నిలుచున్నాడు. ఈ క్రమంలో బస్సు ఒక్కసారిగా ముందుకు కదలడంతో పట్టుతప్పి రోడ్డుపై పడిపోయాడు. చేతికి, తలకు గాయాలు అయ్యాయి. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించిన అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తల్లిదండ్రులు తీసుకు వెళ్లారు.

పీపీ అగ్రహారంలో వరి కుప్పలు దగ్ధం

మాకవరపాలెం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పీపీ అగ్రహారంలో రొంగల వెంటకరమణ అనే రైతుకు చెందిన మూడు వరి కుప్పలు దగ్ధమయ్యాయి. దీంతో భారీగా నష్టం ఏర్పందిం.ఇ ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి. రొంగల వెంటకరమణకు చెందిన ఎకరా భూమితో పాటు మరో ముగ్గురు రైతులకు చెందిన భూమిని భాగానికి తీసుకొని సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వరి పొలం బాగా పండడంతో పెద్దగా మూడు వరికుప్పలు పెట్టారు. గురువారం ఉదయం ఆరుగంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు వరి కుప్పలకు నిప్పుపెట్టినట్టు స్థానికులు చెబుతున్నారు. రైతులతో పాటు స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్‌ఐ దామోదరనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

'వచ్చే నెల నాటికి అభివృద్ధి పనులు పూర్తి'

నాతవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఫిబ్రవరి చివరినాటికి మండలంలో 15వ ఆర్థిక సంఘం నిధులు. జనరల్ ఫండ్ తో జరుగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని జడ్పీ డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్ మండల పరిషత్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఃమండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీరాజ్ అధికారులు నిత్యం అభివృ పనులను పర్యవేక్షిస్తూ పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జిల్లాలో వివిధ మండల పరిషత్ కార్యాలయాలలో ఖాళీగా ఉన్న పోస్టులు త్వరలో భర్తీ చేయనున్నామన్నారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీడీవో ఉషశ్రీ, ఏవో పి. పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

రెవెన్యూ సదస్సుల్లో అర్జీలపై ప్రత్యేక దృష్టి

- వేణుగోపాల్, తహసీల్దార్



భూ సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో అందే అర్జీలు అన్నింటిపై ప్రత్యేక దృష్టిసారించాం. రెవెన్యూ శాఖ పరంగా ఏ సమస్య ఉన్నా మా కార్యాలయంలో తెలియజేస్తే విచారణ జరిపి, పరిష్కారానికి కృషి చేస్తాం.

ప్రశ్న : ఇప్పటివరకు ఎన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఎన్ని అర్జీలు వచ్చాయి. ఈ సమస్యలను ఎప్పటిలోగా పరిష్కరిస్తారు?

జవాబు : 39 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. మొత్తం 529 అర్జీలు రాగా 114 అర్జీలను పరిష్కరించాం. మిగతావి కూడా నిర్దేశిత సమయంలో పరిష్కరిస్తాం.

ప్రశ్న : కొందరు రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నప్పటికీ ఆ భూముల వివరాలు ఆన్‌లైన్‌లో ఉండడం లేదంటున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఏం చర్యలు తీసుకుంటారు ?

జవాబు : రైతులు స్వయంగా వచ్చి తెలియజేస్తే ఈ సమస్యను పరిష్కరిస్తాం. సర్వే నంబర్లు తప్పులు ఉన్నా సరిచేస్తాం.

ప్రశ్న : తాండవ నిర్వాసితులు 356 మందికి మాధవనగరంలో డి.పట్టా భూములివ్వగా, గత కాంగ్రెస్ ప్రభుత్వంలో 150 మందికి పట్టాదారు పుస్తకాలు ఇచ్చారు. మిగతా వారికి పాసుపుస్తకాలు ఎప్పుడిస్తారు ?

జవాబు :విచారణ జరిపి సాగులో ఉన్నవారిని గుర్తించి పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తాం.

ప్రశ్న : ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా తీసుకుంటున్న చర్యలేమిటి?

జవాబు : ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా వీఆర్‌వోలు ప్రత్యేక నిఘా పెడుతున్నారు. ఏ గ్రామంలోనైనా ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైతే వారిపై చర్యలు తీసుకుంటాం. - నాతవరం

గొంపలో చెరువు సరిహద్దులు గుర్తింపు



సరిహద్దులు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

రావికమతం, జనవరి 9, (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు గొంప గ్రామంలోని మిరియాల చెరువు సరిహద్దులను రెవెన్యూ అధికారులు గురువారం గుర్తించారు. గ్రామంలో గత ఏడాది డిసెంబరు 12న జరిగిన రెవెన్యూ సదస్సులో మిరియాల చెరువు ఆక్రమణతో వందలాది ఎకరాల ఆయకట్టు భూములకు సాగు నీరందడంలేదని రైతులు తహసీల్దార్ బి.వెంకట రమణకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తహసీల్దార్ ఆ వెంటనే పరిశీలించారు. 90 శాతం చెరువు గర్భం సాగు భూమిగా మారిపోవడంతో విస్మయం వ్యక్తంచేశారు. చెరువు ఆక్రమణపై కలెక్టర్‌కు నివేదిక పంపారు. రెవెన్యూ సదస్సులు ముగియడంతో గురువారం పోలీస్‌ల సమక్షంలో మండల సర్వేయర్ సురేశ్ తన సిబ్బందితో వెళ్లి సర్వే నంబర్ 144లో 38 ఎకరాల విస్తీర్ణం గల చెరువుకు సరిహద్దులు ఏర్పాటు చేశారు.ఈ చెరువు పూడిక తీతకు ఉపాధి నిధులు మంజూరయ్యాయి. త్వరలో పూడికతీత పనులు చేపట్టనున్నారు.

ఆస్పత్రుల్లో ప్రసవాలతో తల్లీ బిడ్డకు శ్రేయస్కరం



గర్భిణులకు సూచనలు చేస్తున్న వైద్యాధికారి పూజిత మేఘన

దేవరాపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) హాస్పిటల్‌లో ప్రసవాలు జరగడంతో తల్లీ బిడ్డకు శ్రేయస్కరమని స్థానిక ఆస్పత్రి వైద్యాధికారి పూజిత మేఘన అన్నారు. ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం కింద గురువారం 56 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వీరిలో పది మందిని హైరిస్క్‌గా గుర్తించి మెరుగైన వైద్య సేవలు కోసం కె.కోటపాడు, తరలించామన్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆహార నియమాలు, జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్య వేక్షకులు పుష్పరాజు, లక్ష్మి, సునీత పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనం గిట్టుబాటు కావాలి



కొలతలపై ఫీల్డ్ అసిస్టెంట్‌లకు శిక్షణ అందిస్తున్న అధికారులు

మాడుగుల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు దినసరి వేతనం రూ. 300లు వచ్చేలా చూడాలని ఏపీడీ బండారు శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాడుగుల, చీడికాడ, బుచ్చెయ్యపేట మండలాలకు సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్‌లతో నిర్వహించిన శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. వేతనం గిట్టుబాటయ్యేలాకూలీలకు అవగాహన కల్పించాలన్నారు. కూలీలు చేసే పనికి కొలతలు ఏ విధంగా వేయాలని శిక్షణ అందించారు. ఉపాధి పనుల్లో ఎక్కడా అవకతవకలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవోలు మురళీకృష్ణ, వరహాలుబాబు, గంగునాయుడు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు అండగా విశాఖ డెయిరీ

▸ ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు

▸ సభ్యులకు రూ. 5. 64 కోట్లు సంక్రాంతి బోనస్ పంపిణీ



సొసైటీ అధ్యక్షులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు, పక్కన విశాఖ డెయిరీ దివంగత చైర్మన్ తులసీరావు భార్య జయమ్మ, డైరెక్టర్లు

బుచ్చెయ్యపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని పాడి రైతులకు విశాఖ డెయిరీ అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ ఎస్ రాజు విజ్ఞప్తి చేశారు. గురువారం మండలంలోని కోమళ్లపూడిలో డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని 107 పాలసంఘాల పరిధిలోని సభ్య రైతులకు సంక్రాంతి బోనస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ, గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు డెయిరీ దివంగత చైర్మన్ ఆడారి తులసీరావు చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆడారి తులసీరావు భార్య జయమ్మ, డెయిరీ డైరెక్టర్ పిళ్లా రమాకుమారి మాట్లాడుతూ, పాడి రైతుల సంక్షేమమే తమ మొదటి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. డైరెక్టర్ గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 107 సంఘాలకు చెందిన 20,500 మంది రైతులకు మొత్తం రూ. 5,64,23 కోట్లు సంక్రాంతి బోనస్‌గా చెల్లిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జి. కోటేశ్వరరావు, నాయకులు ఎం.వీ.వీ. సత్యనారాయణ, దొండాసన్యాసిరావు, రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పాలసంఘాల అధ్యక్షులు, డెయిరీఅధికారులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రినిని కలిసిన చోడవరం నేతలు



ప్రధానమంతికి వీడ్కోలు పలుతుకున్న ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు

చోడవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విశాఖ పర్యటన సందర్భంగా నియోజకవర్గానికి చెందిన కూటమినేతలు ఆయనకు స్వాగతం, వీడ్కోలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రధానికి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు సాదరంగా ఆహ్వానం పలికారు. రాత్రి విమానాశ్రయంలో వీడ్కోలు పలికారు. దీంతో కూటమినేతలు, కార్యకర్తలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

రోలుగుంట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంఈఓ కార్యాలయంలో గురువారం యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ, అధ్యాపక దర్శనిలను ఎంఈఓలు జగ్గారావు, జాన్‌ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల అధ్యక్షులు కాళింగ సతీశ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై తమ యూనియన్ నిత్యం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి యు.నాగభూషణం, గౌరవ అధ్యక్షులు కేశవరావు, సహాధ్యక్షులు బి.భారతి తదితరులు పాల్గొన్నారు.

వరి కుప్పలు దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రావికమతం, జనవరి 9, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్నికం గ్రామంలో రెండువరి కుప్పలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన కే శంశెట్టి రమణ గ్రామ సమీపంలో రెండు వరి కుప్పలు వేశారు. గురువారం తెల్లవారు జామున జరిగిన ఈ ప్రమాదంలో ఈ వరి కుప్పలు కాలిపోయాయి. రూ. లక్ష విలువైన ధాన్యం కాలిపోయినట్టు అంచనా. కాల్చిపడేసిన సిగరెట్టు, లేదా చుట్ట వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు అనుమానిస్తున్నారు. ఏడాది శ్రమ బూడిద పాలవడంతో బాధిత రైతు కుటుంబం బోరున విలపించారు. సమాచారం తెలుసుకున్న రావికమతం అగ్నిమాపక సిబ్బంది హుటాహుటీన చేరుకుని మంటలను అదుపు చేశారు.

పాఠశాలల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



రావికమతంలో భోగి మంట వద్ద చిన్నారులు



మాడుగుల డిగ్రీ కళాశాలలో పొంగలి వంట



మరుపాక జడ్పీ పాఠశాలలో భోగి మంట వేస్తున్న దృశ్యం

రావికమతం, జనవరి 9, (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో గురువారంసంక్రాంతి వేడుకలను హెచ్ ఎం.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పెరేంట్ కమిటీ తల్లితండ్రులు పాల్గొన్నారు. హరిదాసు, సోదిచెప్పే మహిళ, బుడబుక్కల, గంగిరెడ్ల వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నాయి. చిటికల భజనలు, కోలాటాలు ఆడారు. ఉట్టి కొట్టే సంబరం నిర్వహించారు. అనంతరం పెద్ద పెద్ద భోగి మంటలు వేశారు. విద్యార్థినులు వేసిన ముగ్గులు అలరించాయి. సంక్రాంతి కోడి పందేల వేషధారణ ఆకట్టుకుంది. మరుపాక మోడల్ స్కూల్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు జరిగాయి

మాడుగులలో

మాడుగుల: స్థానిక డిగ్రీ కళాశాల, సెయింటెస్ పాఠశాలలో ఈ సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. సంక్రాంతి పిండి వంటకాలు తయారీ, పండగలో గంగిరెద్దులు, హరిదాసు వేషధారణలతో విద్యారులు అలరించారు. భోగిమంటలు, గాలిపటాలు ఎగురవేశారు. కొత్త కుండలో పాలు పొంగించడం, సాంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు, అధ్యాపకులు సందడిచేశారు. అనంతరం విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు ఉపాధ్యాయులు తెలిపారు.

దేవరాపల్లి: స్థానిక క్రైస్ట్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలోగురువారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. భోగి మంటలు, ముగ్గులు, హరిదాసు వేషధారణలు అలరించాయి. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.కె.దినేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చోడవరం ఉషోదయ కళాశాలలో...

చోడవరం: స్థానిక ఉషోదయ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు, భోగిమండపాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రమణాజీ, డీన్ వాసు, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

పండగ సంతకు పోటెత్తిన గిరిజనులు



కుండలు కొనుగోలు చేస్తున్న గిరిజనులు

చీడికాడ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాంలో గురువారం జరిగిన పండుగ సంతకు ఏజెన్సీ గ్రామాల నుంచి గిరిజన కుటుంబాలు పోటెత్తి తరలివచ్చారు. భోగి, సంక్రాంతి పండుగలకు తమ పెద్దలకు సమర్పించేందుకు నూతన వస్త్రాలు, కుమ్మరి కుండలు, నిత్యావసర సరుకులు కొనుగోలులో నిమగ్నమయ్యారు. నాటుకోళ్ల కొనుగోలు చేశారు. ఉదయం గిరిజనులతో కళకళలాడింది. వస్త్ర, కుమ్మర్లు, తదితర చిరువ్యాపారులు ఆనందం వ్యక్తంచేశారు.

స్వామి వివేకానంద జయంతి



మంగళాపురంలో వివేకానందుడికి నివాళులర్పిస్తున్న దృశ్యం

బుచ్చెయ్యపేట, జనవరి9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళాపురంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం వివేకానంద 162ం జయవతిని ఘనంగా నిర్వహించారు. అతిథిదేవోభవ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకుడు ఆరిపాక కామేశ్వరరావు, విద్యార్థులకు వివేకానందుని చరిత్ర వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం రామలక్ష్మి, ఉపాధ్యాయులు వి. కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


రెండేళ్లుగా అసంపూర్తిగా నిలిచిన రహదారి



బీటీ రోడ్డు సమాచారంతో బొర్రంపేట వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

అనుసంధాన రహదారిపై నిర్లక్ష్యం

- అసంపూర్తిగా బొర్రంపేట రాజవొమ్మంగి మండలం లకారపుపాడు రోడ్డు
- మూడేళ్లుగా గ్రావెల్‌తో సరి
- అల్లూరి, తూర్పుగోదావరి జిల్లాల సరిహద్దు గ్రామాల ప్రజలకు అవస్థలు

కొయ్యూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రెండు జిల్లాలను కలిపే అనుసంధాన రహదారి నిర్మాణం నత్తనడకన సాగుతుండడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాలివి... జిల్లాల విభజనకు ముందు తూర్పుగోదావరి, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలను కలుపుతూ మండలంలో కొమ్మిక పంచాయతీ శివారు బొర్రంపేట నుంచి అప్పటి తూర్పు గోదావరి జిల్లా రాజవొమ్మంగి మండలం లకారపుపాడును కలుపుతూ 2021లో బీటీ రోడ్డుకు ఉపాధి పథకంలో రూ.60 లక్షలు మంజూరు చేశారు. సుమారు 2 కిలోమీటర్లు మేర బీటీ రోడ్డు నిర్మించాల్సి ఉంది. అయితే, కొయ్యూరు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం వారి పర్యవేక్షణలో ఈ రహదారి నిర్మాణాలు చేసేలా నిర్ణయించారు. అయితే, కాంట్రాక్టరు మట్టి పనులు చేసి మెటల్ స్టోన్‌డస్టు కలిపి రహదారిపై పరిచిన అనంతరం నిర్మాణ పనులను నిలిపివేశారు.

గతంలో రెండు జిల్లాలను కలిపేందుకు ప్రతిపాదించిన ఈ రహదారి జిల్లాల విభజన అనంతరం అల్లూరి జిల్లాలో చేరింది. అయినా, నిర్మాణాలు ముందుకు సాగలేదు. ఈ రహదారి పూర్తయితే, రాజవొమ్మంగి మండలానికి చెందిన సుమారు 20 గ్రామాల వారు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే సుమారుగా 30 కిలోమీటర్లు కలిసివస్తోంది. అలాగే కొయ్యూరు మండలానికి చెందిన ఆడాకుల, బా లారం, బకులూరు, కంఠారం, కొమ్మిక పంచాయతీలకు చెందిన సుమారు 40 గ్రామాల వారు అడ్డతీగల, రంపచోడవరం, మారేడుమిల్లి, అటుగా భద్రాచలం వెళ్లాలన్నా సుమారుగా 50 కిలోమీటర్ల మేర తగ్గుతుంది. అయితే, ఈ రహదారికి కేటాయించిన నిధులు పక్కదారి పట్టాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై పంచాయతీ రాజ్ మండల జేఈ రామకృష్ణను సంప్రదించగా ఈ రహదారి విషయం తన దృష్టిలో లేదన్నారు. వివరాలు తెలుసుకుని నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్


అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో సా మాజిక మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. స్వచ్ఛ భారత్ మిషన్‌పై కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో జన సమూహం అధికంగా ఉన్న ప్రాంతాలు, వారపు సంతలు, పర్యాటక ప్రదేశాల్లో, నీటి సదుపాయం ఉన్న గ్రామాల్లో సామాజిక మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. అలాగే మరుగుదొడ్లు లేని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ వీటిని నిర్మించాలన్నారు. అలాగే పారిశుధ్య పనుల కోసం మంజూరు చేసిన వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలని, ట్రాక్టర్లు ఎక్కడ? ఎటువంటి స్థితిలో ఉన్నాయో ఆడిట్ చేసి నివేదికలు సమర్పించాలని సూచించారు. అలాగే కోరిన వారందరికీ వ్యక్తిగత ఇంకుడు గుంతలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అలాగే ఉపాధి హామీ పథకంలో కమ్యూనిటీ ఇంకుడు గుంతలు నిర్మిస్తామన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ ఆధ్వర్యంలో వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేస్తామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జునరావు అన్నారు. ఇప్పటికే నిర్మించుకుని నివాసం ఉంటున్న గృహాలకు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో మంజూరు చేసిన గృహాలకు వ్యక్తిగత మరుగుదొడ్లను మంజూరు చేస్తామన్నారు. అలాగే, ఈ నిర్మాణాలకు రూ.12 వేలు చొప్పున మంజూరు చేస్తామని, రూ.3 లక్షలతో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపిస్తే దేవాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులు, నాడు- నేడులో నిర్మించని విద్యాలయాలకు మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో నిర్మించిన గృహాలకు 27,834 వ్యక్తిగత మరుగుదొడ్ల మంజూరు చేశామని, జిల్లాలో 22 వేల ఇంకుడు గుంతలు నిర్మాణానికి ప్రతిపాదించామన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పీవోలు వి.అభిషేక్, కె.సింహాచలం, అపూర్వభరత్, జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు, హౌసింగ్ పీడీ బి.బాబు, డీఎల్‌పీవో పీఎస్.కుమార్, డీఈవో పి.బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ ఎల్.రజని, డీఎంహెచ్‌వో జమాల్ బాషా, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

నేడు మూడు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరురూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఫీడర్లు మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం చింతపల్లి, జి.మాడుగుల, ముంచంగిపుట్టు మండలాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నామని పాడేరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చింతపల్లి మండలం పెదవలస ఫీడర్‌లో పెదవలస, సంకాడ, రొంపిలి, నిమ్మలపాలెం గ్రామాలకు, జి.మాడుగుల మండలంలోని బంధవీధి, సింగర్భ, కోరాపల్లి, నుర్మతి, భీరం గ్రామాలకు ముంచంగిపుట్టు మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చింతపల్లిలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు


పాతబస్‌స్టాండ్‌లో చెత్తబుట్టను ఏర్పాటును పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచ్ పుష్పలత

చింతపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం గ్రామంలోని పలు వీధుల్లో చెత్తబుట్టలను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ లంబసింగి, తాజంగి పంచాయతీ కేంద్రాల్లో ఐరన్ చెత్తబుట్టలను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం చింతపల్లి మేజర్ పంచాయతీల్లో 20 చెత్తబుట్టలు ఏర్పాటు చేశామన్నారు. ఇళ్లలోని వారికి తడి, పొడి చెత్తను నిలువ చేసేందుకు గతంలో ప్లాస్టిక్ బుట్టలు వ్యక్తిగతంగా అందజేశామన్నారు. ప్రజలు చెత్తను పంచాయతీ సిబ్బందికి అప్పగించాలని సూచించారు. వీధుల్లో ఏర్పాటు చేసిన బుట్టల్లో వేసిన చెత్తనుఎప్పటికప్పుడు తొలగిస్తారన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ దురియా పుష్పలత, కార్యదర్శి శ్రీధర్, గుమస్తా అంబేడ్కర్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ


ఉపాధి పథకం ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఐటీడీఏ పీవో తదితరులు

పాడేరురూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఏఎస్ఆర్ జిల్లా ఉపాధి హామీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం 2025 సంవత్సర క్యాలెండర్‌ను గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, జేసీ అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్య మన్ పటేల్, డ్వామా పీడీ విద్యాసాగరరావులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సం ఘం అధ్యక్షుడు వి.సురేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.సురేష్‌కుమార్, కార్యదర్శి జి.సూర్యనారాయణ, కోశాధికారి జి.ఆనంద్, ఈసీ మెంబర్ టి.రామస్వామి, పాడేరు డివిజన్ అధ్యక్షుడు ఉబ్బేటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుంగారుమామిడిలో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

డుంబ్రిగుడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కించుమండ పంచాయతీ కుంగారుమామిడి గ్రామంలో గురువారం వైద్యాధికారి రాంబాబు ఆధ్వర్యంలో గ్రామస్థులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు. గ్రామాల్లో వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఆసుపత్రిలోనే సుఖ ప్రసవాలు జరుగుతాయన్నారు. అందువల్ల నెలల నిండిన తర్వాత గర్భిణులు ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలను సంప్రదించాలని కోరారు. వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలని గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ పద్మ, హెల్త్ అసి స్టెంట్ సంజీవ్, ఎంఎల్‌హెచ్‌పీ గణ, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పరిస్థితిపై సమాచారం ఇవ్వండి


ఎన్ఆర్‌పురంలో గిరిజనులతో సమేకమైన ఎస్ఐ శ్రీనివాసరావు

అనంతగిరి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన గ్రామాల్లో పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని స్థానిక ఎస్ఐ డి.శ్రీనివాసరావు కోరారు.. ఎన్ఆర్‌పురం పంచాయతీలో గురువారం ఆయన పర్యటించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై అవగాహన కల్పించారు. గ్రా మాల్లో అసాంఘిక కార్యకలాపాలపై, కొత్త వ్యక్తులు సంచరిస్తే సమాచారమివ్వాలని సూచించారు. యువత సన్మార్గంలోని నడవాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు. సంక్రాంతి నేపథ్యంలో పేకాట, కోడి పం దాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామయ్య, మాజీ సర్పంచ్ రవి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీఅక్షర హైస్కూల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంబరాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

పాడేరురూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ అక్షర హైస్కూల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఐ.రాజేష్ మాట్లాడుతూ మన పండగలు, ప్రాముఖ్యత, సాంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేసేందుకు ఏటా పాఠశాలలో సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నామన్నారు. ముందుగా పాఠశాల ప్రాంగణంలో ఉన్న సరస్వతీదేవి విగ్రహానికి పూలమాలలు వేశారు. భోగి, సంక్రాంతి, కనుమ పండగలను స్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గులు, నృత్య తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డీఎస్.మూర్తి, ఎస్.సింహాచలం, జి.జ్యోతి, పి.గౌరి, ఎస్.క్రిష్ణవేణి, టి.సోమేశ్వరి, పి.కౌశిక్, పి.నాగరాజు, జె.కొండాజీ, వి.సోమనాథ్, వి.భారతి, ఎ.శ్రవంతి, సీహెచ్.దేవమ్మ, కె.శ్రీజ, జి.సుశీల, ఎం.ధనలక్ష్మి, పి.రాజ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

పెసా చట్టాన్ని పటిష్ఠంగా అమలు: ఐటీడీఏ పీవో


ఐటీడీఏ పీవోను మర్యాద పూర్వకంగా కలిసిన పెసా కమిటీ ప్రతినిధులు

పాడేరురూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పెసా చట్టాన్ని పటిష్ఠంగా అమలుకు ఆయా కమిటీల ఉపాధ్యక్షులు, కార్యదర్శులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు. పాడేరు పంచాయతీ పరిధిలోని పాడేరు, గుడివాడ, సుండ్రుపుట్టు గ్రామాల నుంచి ఇటీవల ఎంపికైన పెసా కమిటీ ప్రతినిధులు గురువారం పీవో అభిషేక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం పరిధిలో ఉన్న ప్రతీ అం శాన్ని పరిశీలించి గ్రామ సభ ద్వారా గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలన్నారు. ప్రతీ విషయానికి తీర్మానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు సల్లా రామకృష్ణ, బోనంగి వెంకటరమణ, దస్నేటి పలాసి రాంబాబు, కార్యదర్శులు కిల్లో రాధాకృష్ణం నాయుడు, కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, జవ్వాది లింగమూర్తి పాల్గొన్నారు.

సమస్యలకు సత్వరమే పరిష్కారం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్

డుంబ్రిగుడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): డుంబ్రిగుడ గ్రామంలో కిడారి సామాజిక భవనంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్ మాట్లాడుతూ, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు దోహదపడతాయన్నారు. గ్రామ సభలు టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వంలో రీసర్వేతో గిరిజనులు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. కూటమి ప్రభుత్వ హయాంలో భూ సమస్యలను పరిష్కారించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచి వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు గీత, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, విఆర్వో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచి త్రినాథ్

ముంచంగిపుట్టు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కర్లాపొదర్ గ్రామంలో గురువారం సర్పంచి కె.త్రినాథ్ సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పీ నిధులు రూ. 5లక్షలతో 110 మీటర్ల సీసీ రోడ్డు పనులు చేపడతామన్నారు. వర్షం పడితే తలెత్తుతున్న ఇబ్బందులపై జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకువెళ్లగా ఆమె స్పందించి నిధులు మంజూరు చేశారన్నారు. నాణ్యత పాటిస్తూ సకాలంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జగబంధు, నేతలు సాధురాం, బుద్ధు, నీలకంఠం, రాజు తదితరులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధుల నిరోధంపై వైద్య సిబ్బందికి శిక్షణ


శిక్షణలో పాల్గొన్న వైద్య సిబ్బంది

పాడేరురూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు కీటక జనిత వ్యాధులపై వైద్యాధికారులు, సబ్‌యూనిట్ ఆఫీసర్లకు పాడేరులో గురువారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాడేరు డివిజన్ పరిధిలోని 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, జిల్లా మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్లకు ఎన్వీబీసీపీ ప్రొగ్రాంకు సంబంధించిన మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా తదితర వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మలేరియా అడిషనల్ డైరెక్టర్ డాక్టర్. బి.సుబ్రమణ్యేశ్వరి, డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా, జోనల్ మలేరియా ఆఫీసర్-1 డాక్టర్.ఎం.శాంతిప్రభ, జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి, విశాఖ ఏడీ జోనల్ అధికారి కేవీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశానికి అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

- అరకు మండలాభివృద్ధి కార్యాలయం ఎదుట ఎంపీపీతో సహా సభ్యులు నిరసన


సమావేశ మందిరం ఎదుట నిరసన తెలుపుతున్న ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచులు

అరకులోయ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సమావేశానికి పలు శాఖల అధికారులు సకాలంలో హాజరుకాకపోవడంతో ఎంపీపీతోసహా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమావేశాన్ని బహిష్కరించి నిరసన తెలిపారు. గురువారం స్థానిక మండలపరిషత్ సమావేశం ఉదయం పదిగంటల నుంచి సమావేశం ప్రారంభం కావాల్సి ఉంది. ఈ సమయానికి ఎంపీపీ ఆర్.ఉషారాణి, 16 మంది ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు 10.30కు సమావేశ మందిరానికి చేరారు. వీరితో పాటు ఎంపీడీవో లవరాజు, రెవెన్యూ, ఐసీడీఎస్, మాడగడ పీహెచ్‌సీ వైద్యసిబ్బంది, విద్యాశాఖ అధికారులు మాత్రం ఇదే సమయానికి వచ్చారు. అయితే, 23 శాఖల అధికారులు పాల్గొనాల్సి ఉండగా, కేవలం ఐదు శాఖల అధికారులే సమావేశానికి హాజరయ్యారు. దీంతో అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మూడునెలలకోసారి నిర్వహించే సమావేశానికి కూడా అధికారులు రాకపోతే ఎలా అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశ భవనం ఎదు టకు వచ్చి సభ్యులంతా నిరసన వ్యక్తం చేశారు. తక్షణం గైర్హాజరైన అధికారులపై శాఖాపరమైన చర్యలు చేపట్టేలా తీర్మానం చేసి సంతకాలు పెట్టి కలెక్టర్‌కు అందించాలని నిర్ణయించారు. ఆ మేరకు ఎంపీపీ చాంబర్‌లో సమావేశమై తీర్మానం సిద్ధం చేశారు. ఎంపీడీవో లవరాజు సమావేశానికి రావాలని వారికి నచ్చచెప్పాలని చూసినా ఫలితంలేకపోయింది. సమావేశ సమయానికి ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మాడగడ పీహెచ్‌సీ నుంచి వైద్యసిబ్బంది, ఎంఈవో హాజరుకాగా మిగిలిన శాఖల నుంచి 12 గంటల తర్వాత ఒక్కొక్కరూ తాపీగా రావడం గమనార్హం.

ఆస్పత్రిలో చాలీచాలని భోజనమా?

- ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో రోగుల ఆగ్రహం


ఆవేదన వ్యక్తంచేస్తున్న రోగులు

ముంచంగిపుట్టు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో చాలీచాలని భోజనం వడ్డించడంపై గురువారం రోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వంటలు కూడా అధ్వానంగా ఉన్నాయంటూ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ గీతాంజలి దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఆస్పత్రిలో ఇస్తున్న ఉచిత భోజనం అధ్వానంగా ఉంటుందని, గత్యంతరం లేక తినాల్సి వస్తుందని వాపోయారు. అది కూడా చాలీచాలనట్టు ఉంటోందన్నారు. సీహెచ్‌సీలో సుమారు 45 మంది రోగులు ఉంటే 25 మందికి సరిపోయేలా భోజనాలు తీసుకువస్తున్నారు. దీంతో చిటికెడు కూర వేస్తున్నారని ఆరోపించారు. కొంత మందికి గుడ్డు కూడా ఇవ్వడంలేదని చెప్పారు. అర్ధాకలితో ఉండాల్సిన దుస్థితి ఉంటుందని వాపోయారు. అధికారులు స్పందించి భోజనం నాణ్యతతో పాటు మెను ప్రకారం అందించే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. గత కొన్నాళ్లుగా ఆస్పత్రిలో భోజనం నాణ్యత లేదని తరచూ రోగులు ఆందోళనలు చేయడంతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. అయినా అధికారిక యంత్రాంగం స్పందించక పోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పెంపు

- జీసీసీ చింతపల్లి డివిజనల్ మేనేజర్ పి.దేవరాజు


మాట్లాడుతున్న డీఎం దేవరాజు

చింతపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి):గిరిజన రైతులనుంచి సేకరించిన అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు ధరలను 2024-25కు సంబంధించి జీసీసీ పెంచినట్టు స్థానిక డివిజనల్ మేనేజర్ పి.దేవరాజు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరక్కాయలు కిలో రూ.20, ముషిడి గింజలు రూ.100 తానిక్కాయలు రూ.18, నల్ల జీడిపిక్కలు రూ.22, చింతపండు(పిక్కతో) రూ.34, పిక్కతీసింది రూ. 67 , విప్పబద్దలు రూ.32, కుంకుడుకాయలు రూ.35, శీకాకాయ రూ.40, అడవీ తేనె రూ.250, పెట్టితేనె రూ.150, తేనె మైనం రూ.160, ఇండుగ పిక్కలు రూ.50, నరమామిడి చెక్క రూ.18, కొండపుర్లు గ్రేడ్-1 రూ.45, గ్రేడ్-2 రూ.40, గ్రేడ్-3 రూ.35, మారేడుగడ్డలు రూ.300, విప్పపువ్వు రూ.17, కొండతామర జిగురు రూ.120- 200, గుగ్గిలం రూ.70-120, తిప్పతీగ రూ.70, పాలగుండ వేరురూ.270, రాజ్‌మా చిక్కుళ్లు ఎరుపు రూ.80, బొబ్బర్లు రూ.50, రాగులు రూ.30, ఎండుమిర్చి రూ.145 నిర్ణయించారు. కిలో పార్చిమెంట్ రూ.320, చెర్రీ (గుల్ల) కిలో రూ. 170, రొబస్టా కిలో రూ.100కు కొనుగోలు చేస్తున్నామన్నారు.

గిరిజన రైతులకు సన్మానం



సెయింట్‌ఆన్స్ పాఠశాలలో రైతులతో ఉపాధ్యాయులు

పెదబయలు, జనవరి 9(ఆం ధ్రజ్యోతి): స్థానిక సెయింట్‌ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రిన్సిపాల్ నిర్మల ఆన్ ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర గిరిజన రైతులను ఘ నంగా ఘనంగా సత్కరించారు. వారికి వివిధ క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులందజేశారు. ముఖ్య అతిథిగా మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. సం క్రాంతి వ్యవసాయానికి సంబంధించిన పండగని అన్నారు. దేశ సరిహద్దుల్లో జవాన్‌లు ఎంత ముఖ్యమో ప్రజల ఆకలి తీర్చటానికి రైతు అంతే అవసరమన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో భోగి మంటలు వెలిగించి, గాలి పటాలను ఎగరవేశారు. విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ స్వాజీ, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

పెదబయలు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గురవారం స్థానిక మండల విద్యాశాఖ అధికారులు కొమ్ము కృష్ణమూర్తి, గుమ్మ పుష్పజోసెఫ్ ఆధ్వర్యంలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) డైరీ, క్యాలెండర్‌ను ఆ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీడీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పలాసి తిరుపతిరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా 117 జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలన్నారు. ప్రాథమిక విద్య మాతృభాషలోనే బోధించేలా చూడాలన్నారు. ఉన్నత పాఠశాలలోనూ తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాల్లో సాగేలా విధానాలను అమలు చేయాలని కోరారు. పాఠశాల హెచ్ఎం జీ సతీశ్, డీటీఎఫ్ నాయకులు కే సంజీవరావు, బీ భగవాన్, వి.మాధవరావు, బి.జగ్గరావు, సీహెచ్. భీం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనానికి విస్తృత ఏర్పాట్లు

▸▸ దేమునిగుమ్మం ఆలయంలో నేటి వేకువజాము నుంచే స్వామివారి దర్శనం ▸▸ సుప్రభాత సేవతో పూజలు ఆరంభం


దేమునిగుమ్మంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్పాలంకరణ


ప్రమాణ స్వీకారం చేసిన ఉత్సవ కమిటీ సభ్యులు

అనకాపల్లి టౌన్, జనవరి 9 (ఆంధ్ర జ్యోతి) : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని పట్టణంలోని పురాతనమైన దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం ఇక్కడ స్వామివారు ఉత్తరద్వారం నుంచి దర్శనం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు సిద్ధం చేశారు. వేకువజాము రెండున్నర గంటలకు సుప్రభాత సేవ, నిత్యార్చన అనంతరం భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించనున్నారు. దాతలు ఆలయంలో ప్రసాదం పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. ఏటా వేలాది మంది ఇక్కడికి ఉత్తరద్వార దర్శనానికి వస్తుండడం ఆనవాయితీ. ఈ వేడుకల్లో భాగంగా ఆలయం లోపల భారీ ఎత్తున పుష్పాలంకరణ జరిపారు. అయోధ్య బాలరాముడు విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. భక్తులు శ్రీవారి దర్శనం పూర్తి చేసుకున్న తర్వాత అయోధ్య బాలరాముడ్ని దర్శనం చేసుకునే విధంగా అధికారులు క్యూలైన్‌లను సిద్ధం చేశారు. ఇదిలావుంటే, ఆలయంలో ఏర్పాట్లను పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ఎస్‌ఐలు డి.ఈశ్వరరావు, పి.సత్యనారాయణ, ఆలయ ఈవో రాజసులోచన, కూటమి నాయకులు గురువారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీసులు వేకువజాము నుంచి శుక్రవారం రాత్రి వరకు బందోబస్తు నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం జీవీఎంసీ ఆధ్వర్యంలో మొబైల్ టాయిలెట్స్, మంచి నీరు అందుబాటులో ఉంచుతున్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ విజయ్‌కుమార్, ఎస్

భారీగా పోలీసు బందోబస్తు

ఈ సందర్భంగా పట్టణ సీఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆలయంలో ఉత్తరద్వార దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. డీఎస్పీ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్‌ఐలు, వందమందికి పైగా సిబ్బంది వేకువజాము నుంచి రాత్రి వరకు విధులు నిర్వహించనున్నామన్నారు. వీఐపీలు వారికి కేటాయించి వేళల్లోనే దర్శనాలకు అనుమతించాలని ఆలయ అధికారులకు సూచించినట్టు చెప్పారు.

దేమునిగుమ్మం ఆలయ ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారం

దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయ ఉత్సవ కమిటా గురువారం రాత్రి ప్రమాణ స్వీకారం చేసింది. చైర్మన్‌గా బొలిశెట్టి శ్రీనివాసరావు, సభ్యులుగా పులకండం గిరిబాబు, గోలి మురళీ, చదరం నూకరాజు, వేదుల సూర్యప్రభ, కొణతాల అరుణ, సోమాదుల తులసీలు ఆలయ అధికారులు, కూటమి నాయకుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, పట్టణ టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మాదంశెట్టి నీలబాబు, పీలా నాగశ్రీను, సకలా గోవిందరావు, ఆళ్ల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత అనకాపల్లికి సహకరించండి

▸▸ జోనల్ కమిషనర్ రమణ విజ్ఞప్తి ▸▸ పట్టణంలో పలు దుకాణాలు తనిఖీ

అనకాపల్లి టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ రహిత అనకాపల్లికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ బీవీ రమణ కోరారు. పట్టణంలోని పలు దుకాణాలను సిబ్బందితో కలిసి గురువారం తనిఖీ చేసి ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. 120 మైక్రాన్ లోపు ఉన్న ప్లాస్టిక్ కవర్లు, ఇతర పరికరాలు నిషేధమన్నారు. వాటిని ఎవరూ వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి వాణిజ్య దుకాణం వద్ద క్యూఆర్ కోడ్ స్టికర్లను అందజేశారు. ప్రజలు కూడా ప్లాస్టిక్ నివారణకు సహకరించాలని కోరారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ వెంట శానిటేషన్ సూపర్‌వైజర్ రవి, భాస్కరరావు, సిబ్బంది ఉన్నారు.


దుకాణంలో ప్లాస్టిక్ కవర్లను తనిఖీ చేస్తున్న జడ్సీ రమణ

కలెక్టర్‌ను కలిసిన 'బుద్ద'


కలెక్టర్ కు డైరీ అందిస్తున్న నాగ జగదీశ్

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌ను మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు గురువారం ఇక్కడ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామి డైరీని ఆమెకు అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాడచీపురుపల్లిలో పారిశుధ్య పనులు

పరవాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాడచీపురుపల్లిలో ఎట్టకేలకు పారిశుధ్య పనులు చేపట్టారు. రోజుల తరబడి వీధుల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలను కార్యదర్శి అచ్యుతరావు పర్యవేక్షణలో సిబ్బంది ట్రాక్టర్ ద్వారా తరలించారు. 'పారిశుధ్యం అధ్వానం' శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీంతో వారు వెనువెంటనే స్పందించారు. ఉదయం నుంచి గ్రామంలో ఎక్కడెక్కడ చెత్తకుప్పలు ఉన్నాయో గుర్తించి, వాటన్నింటినీ ట్రాక్టర్ ద్వారా తరలించే ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


కార్యదర్శి అచ్యుతరావు పర్యవేక్షణలో చెత్తను తరలిస్తున్న పారిశుధ్య కార్మికులు

'అన్ని పాఠశాలలూ సంక్రాంతి సెలవులు ఇవ్వాలి'

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఈ నెల 10 నుంచి 19 వరకు సంక్రాంతి సెలవులు పక్కాగా అమలు చేసేలా చర్యలు చేపట్టాల్సిందిగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సెలవుల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల పేరిట కొన్ని యాజమాన్యాలు ఇప్పటికే ఒత్తిడి తెస్తు న్నట్టు తమ కమిషన్ దృష్టికి వచ్చినట్టు వివరించారు. ఇటువంటి పాఠశాలలపై విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా కోరారు.

ఆటో బోల్తా : ఇద్దరికి తీవ్ర గాయాలు

కశింకోట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బయ్యవరం గ్రామం వద్ద ఆటో బోల్తా పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. తాళ్లపాలెం నుంచి అనకాపల్లి వైపు ఆటో వెళ్తుండగా బయ్యవరం పాల ఉత్పత్తుల తయారీ కేంద్రం సమీపంలో అదుపు తప్పి బోల్తా పడినట్టు స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు.


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

అలివిరా పరిశ్రమలో ప్రమాదం

▸▸ కార్మికుడికి గాయాలు

పరవాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీకి ఎదురుగా గల సెజ్‌లోని అలివిరా యానిమల్ హెల్త్ లిమిటెడ్ పరిశ్రమలో బుధవారం చోటుచేసుకున్న ప్రమాదంలో కాంట్రాక్ట్ కార్మికుడు గాయపడ్డాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటనకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గిషన్ అన్సారీ(21) హేమా ఇంజినీరింగ్ వర్క్సులో కొంతకాలంగా హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే బుధవారం అలివిరా పరిశ్రమలో వెల్డింగ్ పనులు నిమిత్తం తోటి కార్మికులతో విధులకు హాజరయ్యాడు. కంపెనీ ప్రొడక్షన్ బ్లాక్ సమీపంలో వెల్డింగ్ పని చేస్తున్న క్రమంలో రసాయనాలకు సంబంధించిన బకెట్ అతను పొట్ట భాగానికి తగిలింది. అయితే ఈ విషయాన్ని అతను పెద్దగా పట్టించుకోలేదు. పని ముగించుకుని సాయంత్రం ఇంటికి చేరుకున్నాక పొట్ట పై బొబ్బలు ఏర్పడి ఉండడాన్ని గమనించాడు. తోటి కార్మికులు బుధవారం రాత్రి అతడిని ఓ ప్రైవేటు క్లినిక్ తీసుకుని వెళ్లి చికిత్స చేయించారు. అయితే గురువారం ఉదయానికి బొబ్బలు పగిలి ఎర్రగా మారడంతో అగనంపూడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించారు. ఈ విషయం బయటకు పొక్కడంతో గురువారం రాత్రి అతనిని షీలానగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గిషన్ అన్సారీ

పాఠశాలల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు


కశింకోట హైస్కూల్‌లో వివిధ వేషధారణలతో అలరించిన విద్యార్థులు


సబ్బవరం పాఠశాలలో భోగి మంట వద్ద చిన్నారుల సందడి

కశింకోట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోట డీపీఎన్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. ముగ్గులు, గాలిపటాల పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం భోగి మంట వేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.ఆర్.వి. అప్పారావు, ఉపాధ్యాయులు ఆనంద్, నీలవేణి, శేషకుమారి, స్కూల్ యాజమాన్య కమిటీ చైర్మన్ నక్కా నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : ఇక్కడి ఆర్కిడ్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో సంక్రాంతి సంబరాలను ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణలతో సందడి చేశారు. భోగిమంటను వేశారు. ప్రిన్సిపాల్ వి.స్వామినాయుడు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఉమామహేశ్, సిబ్బంది శ్రీకాంత్, దివాకర్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

జీతాల కోసం పారిశుధ్య కార్మికులు 'వంటా- వార్పు'


కార్యాలయం వద్ద వంటా- వార్పు కార్యక్రమం చేపడుతున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లోని క్లాప్ వాహనాల్లో పనిచేస్తున్న కార్మికులు గురువారం ఆందోళన చేపట్టారు. ఉదయం వాహనాల పార్కింగ్ స్థలం వద్ద ధర్నా చేయడంతో పాటు మధ్యాహ్నం అక్కడే వంటా- వార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ కార్మికులు పండగతో పస్తులు ఉండకుండా ఉండేలా తక్షణమే నాలుగు నెలల బకాయి జీతాలు చెల్లించేలా, సమాన పనికి సమాన వేతనం అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం జోనల్ కమిషనర్ బీవీ రమణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యర్రంశెట్టి శివకుమార్, వై.ఏసురాజు, ఓంశివ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

అనకాపల్లి టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాని విశాఖ సభలో మాట్లాడకపోవడం దారుణమని, నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటును ఉపసంహరించుకోవాలని పేర్కొంటూ ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని విశాఖ పర్యటనలో స్టీల్‌ప్లాంట్‌పై ఒక్క మాట కూడా మాట్లాడక పోవడాన్ని ఖండించారు. విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములను సేకరించిన అధికారులు నిర్వాసితులకు పరిహారం, ప్యాకేజీ ఇవ్వకుండా ఆ భూముల్లో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయిస్తుండడం తగదన్నారు. నాయకులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, వీవీ శ్రీనివాసరావు, అల్లు రాజు, ఉమామహేశ్వరరావు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించండి : ఎంపీపీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి

పరవాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి సూచించారు. పరవాడ, వాడచీపురుపల్లి పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందితో గురువారం ఇక్కడి పీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు అవసరమైన మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపైచర్చించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఎస్‌వీ అంబేద్కర్, వైద్యాధికారులు పి.హారిక, జయశ్రీ కరిష్మా, క్రాంతికుమార్, సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ పైలా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టైలరింగ్‌లో మహిళలకు ముగిసినశిక్షణ


శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు పొందిన మహిళలు

కశింకోట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెం భజన మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా సత్యసాయి సమితి అధ్య క్షుడు ఎస్.శంకరరావు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విద్య ద్వారా ఉపాధి పొందాలని సూచించారు. అనంతరం మూడు నెలల నుంచి శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ అధికారి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబానికి ఆర్థిక సాయం

పరవాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల సము ద్రంపై వేటకు వెళ్లి బోటు బోల్తా పడిన ఘటనలో మృతి చెందిన కొవిరి మసేను కుటుంబానికి ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును ఆమె మృతుని కుటుంబ సభ్యులకు గురువారం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చూస్తానని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

నువ్వు సాగులో సమగ్ర యాజమాన్య చర్యలతో మేలు


రైతుకు పురుగు మందులు, విత్తనాల కిట్లు అందిస్తున్న ఏడీ రామారావు

తుమ్మపాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : నువ్వు పంటలో సమగ్ర యాజమాన్య చర్యలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించి తద్వారా మంచి ఆదాయాన్ని పొందవచ్చునని వ్యవసాయశాఖ ఏడీ ఎం.రామారావు తెలిపారు. నూనెగింజల ఆదర్శ గ్రామం కార్యక్రమంలో భాగంగా గురువారం కృషి విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో దిబ్బపాలెంలో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రబీ పంటలో తక్కువ ఖర్చుతో నూనె గింజ పంటలైన వేరుశనగ, పొద్దుతిరుగుడు, నువ్వు పంటలతో నికర ఆదాయాన్ని పొందవచ్చునని వివరించారు. నూనె గింజల అభివృద్ధి పథకంలో భాగంగా రైతులకు నూనెగింజల పంట విత్తనాలను, మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం రైతులకు నూనె గింజల విత్తనాలు, పురుగు మందుల కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పీలా అప్పారావు, రైతు సంఘం నాయకులు వీరునాయుడు, శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

నేరాల నియంత్రణకు నిరంతర నిఘా

- టీవీ విజయ్‌కుమార్, పట్టణ సీఐ



అనకాపల్లిలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ప్రజల సహకారంతో నిరంతరం అప్రమత్తంగా ఉన్నాం. రౌడీ షీటర్లు, అనుమానితుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాం. గస్తీని ముమ్మరం చేశాం. అందరి సహకారంతో ముున్ముందు పట్టణం మరింత ప్రశాంతంగా ఉండేలా పనిచేస్తాం.

ప్రశ్న : సైబర్ నేరాలపై తీసుకుంటున్న చర్యలు ఏమిటి ?

జవాబు : సైబర్ నేరాలకు ప్రజలు గురికాకుండా అప్రమత్తం చేస్తున్నాం. ఈ నేరాలు ఎలా జరుగుతాయని, జరగకుండా ఉండేందుకు ముందస్తుగా ఎలా వ్యవహరించాలి తదితరాలను విద్యా సంస్థలు, క్లబ్బులు తదితరాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. తెలియని నంబర్ల ద్వారా ఫోన్లు వచ్చినా, మేసేజ్‌లు వచ్చినా తొందరపడి ఎవరూ జవాబు ఇవ్వరాదు.

ప్రశ్న : చోరీల నియంత్రణకు చేపట్టే చర్యలు ఏమిటి ?

జవాబు : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎటువంటి నేరాలు జరగకుండా ఎప్పటికప్పుడు నిఘా విస్తృతం చేశాం. దొంగతనాలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. ఎవరైనా ఇల్లు విడిచి వెళ్లేటప్పుడు ముందుగా పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చి నట్టుయితే ఆయా ప్రాంతాల్లో నిఘా మరింత పటిష్ఠం చేస్తాం. పగలు, రాత్రి అనే తేడా లేకుండా సిబ్బందితో నిఘాను విస్తృతం చేశాం.

ప్రశ్న : రౌడీ షీటర్ల కదలికపై ఎలా ఆరా తీస్తున్నారు ?

జవాబు : పట్టణంలో రౌడీ షీటర్లపై నిరంతరం నిఘా ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం ఎక్కడైనా గొడవలకు దిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తున్నాం. రాత్రి వేళల్లో రౌడీషీటర్ల ఇళ్ల వద్ద తనిఖీలు చేస్తున్నాం.

ప్రశ్న : ప్రజలకు మీరిచ్చే సూచనలు ఏమిటి?

జవాబు : నేరాలు పూర్తిస్థాయిలో నియంత్రణ జరగాలంటే ప్రజల సహకారం అవసరం. ఎక్కడ గొడవలు జరిగినా, శాంతిభద్రతల సమస్య తలెత్తినా, ఎటువంటి ప్రమాదాలు జరిగినా వెంటనే మాకు సమచారం అందిస్తే మేం వెంటనే అప్రమత్తం అవుతాయం.

- అనకాపల్లి టౌన్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సబ్బవరం-1 సెక్షన్ పరిధి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్స్ నిర్మాణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆయా ఫీడర్ల పరిధిలోని సబ్బవరం, తవ్వవానిపాలెం, అమృతపురం, గొల్లలపాలెం, పైడివాడ, అసకపల్లి, ఇరువాడ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

పుస్తకాలు పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

కశింకోట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వెదురుపర్తి ఉన్నత పాఠశాలలో మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులకు గురువారం పుస్తకాల పంపిణీ చేపట్టారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఏవీఎస్ మూర్తి మాట్లాడుతూ తల్లిదండ్రులు ఇంటి వద్ద పిల్లల హోమ్ వర్క్ చేయించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన చిన్నారావు, సబిత లక్ష్మి, సోమరాజు, సత్యవేణి, త్రివేణి, నూకరాజు, సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలకు నిరసన


నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

కశింకోట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంటులో అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు దేశ ప్రజలంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు మలపురెడ్డి కోటేశ్వరరావు, సూరా శ్రీనివాస్, కాళ్ళ సత్యనారాయణ, బోయిన భానుమూర్తి యాదవ్ అన్నారు. గురువారం కశింకోట ఎస్సీ కాలనీలో వారంతా పాదయాత్ర నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం కేంద్ర మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. తక్షణమే ప్రధాన మంత్రి ఆయనను ఆ పదవికి రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తుట్ట రమణ, సేనాపతి రాజు, దొమ్మేటి రమణారావు, వేగి కన్న అప్పారావు, బాలమురళీ తదితరులు పాల్గొన్నారు.

నోరూరించే బేంబూ బిర్యానీ

- మన్యంలో ఫేమస్
- ఇష్టంగా తింటున్న పర్యాటకులు
- ఉపాధి పొందుతున్న నిరుద్యోగ గిరిజనులు
- ఇద్దరికి సరిపడా బిర్యానీ రూ.600

(అనంతగిరి- ఆంధ్రజ్యోతి)

మన్యంలో వండే ప్రతి వంటకానికి ఓ ప్రత్యేక ఉంటుంది. గిరిజనుల ఆహారపు అలవాట్లను మైదాన ప్రాంతాల వాసులు ఇష్టపడుతుంటారు. ఏజెన్సీ ప్రాంతంలో బేంబూ చికెన్ ఎంత ఫేమస్ అయిందో అందరికీ తెలిసిందే. ఇదే తరహాలో ఇప్పుడు బేంబూ బిర్యానీ కూడా అంతే ప్రాచుర్యం పొందింది. మన్యానికి వచ్చే పర్యాటకులు తప్పనిసరిగా బేంబూ బిర్యానీ తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. బేంబూ బిర్యానీ తయారు చేసే విధానం విభిన్నంగా ఉండడం, అది రుచికరంగా ఉండడంతో పర్యాటకులు బాగా ఇష్టపడుతున్నారు.



కాలుతున్న వెదురుబొంగులు



వెదురుబొంగులో వేసేందుకు బాస్మతి రైస్‌ను సిద్ధం చేస్తున్న దృశ్యం



ఉడికిన తరువాత గిన్నెలోకి బిర్యానీ తీస్తున్న దృశ్యం

అనంతగిరి మండలంలోని బొర్రా గుహలను తిలకించేందుకు పొరుగు రాష్ట్రాల నుంచే కాకుండా విదేశీ పర్యాటకులు సైతం అధిక సంఖ్యలో వస్తుంటారు. ఇక్కడ గిరిజన యువత తయారు చేసే బేంబూ చికెన్‌ను ఎంతో ఇష్టంగా తినేవారు.

దీంతో పర్యాటకుల అభిరుచికి తగ్గట్టుగా బేంబూ బిర్యానీని తయారు చేయడం మొదలు పెట్టారు. అనంతగిరి, అరకు, డుంబ్రిగుడ, చింతపల్లి, తదితర పర్యాటక ప్రాంతాల్లో బేంబూ బిర్యానీ తయారు చేసేవారి సంఖ్య పెరిగింది. ప్రతి పర్యాటక కేంద్రంలో బేంబూ బిర్యానీ తయారు చేసే దుకాణాలు 5 నుంచి 10 వరకు ఉన్నాయి. దీని వల్ల స్థానిక గిరిజన యువతకు కొంత మేర ఉపాధి దొరుకుతోంది.



పర్యాటకులు ఇష్టంగా తింటున్న బేంబూ బిర్యానీ



వెదురుబొంగులో ముందుగా చికెన్ వేస్తున్న దృశ్యం

తయారు చేసే విధానం

300 గ్రాముల బాస్మతి బియ్యాన్ని తీసుకుని బాగా కడిగి, అరగంట పాటు నానబెట్టాలి. నీటిని పారబోసిన తరువాత దాల్చిన చెక్క, యాలకులు, మరాఠీ మొగ్గ, బిర్యానీ ఆకును బియ్యంలో కలపాలి. తరువాత రెండు చికెన్ లెగ్ పీసులు, రెండు చెస్ట్ పీసులను తీసుకుని అల్లం, వెల్లుల్లి పేస్ట్, దనియాల పొడి, కారం, పసుపు, ఉప్పు, చికెన్ మసాలా, ఆయిల్ వేసి ముద్దలాగా తయారుచేసి చికెన్‌కు దట్టంగా రాయాలి. వెదురు బొంగులో ముందుగా రెండు చికెన్ ముక్కలను పెట్టి గ్లాసు బిరియాని రైస్‌ను వేసి, గ్లాసు నీరుపోసి, ఇంకో చికెన్ ముక్కను పెట్టాలి. అలాగే గ్లాసు బియ్యం వేసి, గ్లాసు నీరు పోసిన తరువాత కొత్తిమీర వేసి అడ్డాకులతో మూత గట్టిగా పెట్టి, అరగంటపాటు వెదురుబొంగును కాల్చాలి. బాగా ఉడికిన తరువాత తీయాలి. అంతే బేంబూ బిర్యానీ రెడీ అవుతుంది.

వెదురు బొంగులకు డిమాండ్

బేంబూ బిర్యానీ ఫేమస్ కావడంతో పర్యాటక ప్రాంతాల్లో వెదురు బొంగులను కూడా సైజ్‌ను బట్టి ఒక్కొక్కటి రూ.150 నుంచి రూ.300 వరకు ధర పలుకుతోంది.

బేంబూ బిర్యానీ తయారుచేసే దుకాణాదారులు వివిధ ప్రాంతాల్లో బొంగులను కొనుగోలు చేస్తున్నారు. అందుకే ఇద్దరికి సరిపడా బిరియానిని రూ.600కు విక్రయిస్తున్నారు.

క్రైం... crime news

ఆటోలో నుంచి జారిపడి విద్యార్థిని మృతి

- సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళుతుండగా ప్రమాదం



యోగిత (ఫైల్ ఫొటో)

ఎస్.రాయవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో ఇంటికి బయలుదేరిన టెన్త్ విద్యార్థిని ప్రమాదవశాత్తూ ఆటోలో నుంచి జారి పడి మృతిచెందింది. దీనికి సంబంధించి హెడ్ కానిస్టేబుల్ పవన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.

రోలుగుంట మండలం కొండపాలెం గ్రామానికి చెందిన పాము యోగిత(16) లింగరాజుపాలెం మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. శుక్రవారం నుంచి పాఠశాలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో గురువారం మధ్యాహ్నం ముగ్గురు స్నేహితులతో కలిసి ఆటోలో స్వగ్రామానికి బయలుదేరింది. సోముదేవుపల్లి సమీపాల మలుపు తిరుగుతున్న క్రమంలో ఆటోలో నుంచి యోగిత ప్రమాదవశాత్తూ జారి పడిపోయింది. గాయాలు కావడంతో వెంటనే పెనుగొల్లు పీహెచ్‌సీకి తరలించగా వైద్యులు పరీక్షించి నక్కపల్లి ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడికి తీసుకు వెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ఈశ్వరరావు (ఫైల్ ఫొటో)

కొత్తూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం శంకరం జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ అడిషనల్ ఎస్ఐ జక్కుల నాగేశ్వరరావు తెలిపిన వివరాలివి. సబ్బవరం నుంచి అనకాపల్లి వెళుతున్న లారీని వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న రేబాక గ్రామానికి చెందిన గోగాడ ఈశ్వరరావు (44) ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఈశ్వరరావు తలకు తీవ్ర గాయమైంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అతను అనకాపల్లిలోని ఓ పెట్రోల్ బంకులో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

417 కిలోల గంజాయి స్వాధీనం

కొయ్యూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి బూదరాళ్ల మీదుగా మైదాన ప్రాంతానికి తరలిస్తున్న 417 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కిశోర్ వర్మ తెలిపారు. గురువారం మధ్యాహ్నం చీడిపాలెం కూడలి వద్ద వాహనాల తనిఖీలో భాగంగా బూదరాళ్ల నుంచి వస్తున్న వ్యాన్‌ను తనిఖీ చేశామన్నారు. ఇందులో గంజాయి మూటలు పట్టుబడ్డాయని చెప్పారు. ఒడిశాకు చెందిన ఒక నిందితుడిని అదుపులోకి తీసు కున్నామని, కేసు దర్యాప్తు నేపథ్యంలో అతని వివరాలను వెల్లడించడంలేదని ఎస్ఐ తెలి పారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసినట్టు చెప్పారు.

గంజాయి రవాణా కేసులో ఇద్దరి అరెస్టు

చోడవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ నుంచి ట్రాక్టర్‌లో గంజాయి రవాణా చేస్తున్న కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను గురువారం అరెస్టు చేసినట్టు స్థానిక సీఐ బి.అప్పలరాజు తెలిపారు. బుధవారం సాయంత్రం పాడేరు వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్‌ను చోడవరంలో పోలీసులు తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు లభించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి అల్లూరి జిల్లా పెదబయలుకు చెందిన చిన్నారావు, త్రిమూర్తులను అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఉదయం పంచనామా నిర్వహించి గంజాయి తూకం వేశారు. మొత్తం 250 కిలోల గంజాయి రవాణా చేస్తున్నట్టు కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆలయాల వద్ద పటిష్ట బందోబస్తు

అనకాపల్లి రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని జిల్లాలోని ప్రధాన దేవాలయాల వద్ద భక్తుల రద్దీకి అనుగుణంగా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ తుహిన్‌సిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నామన్నారు.

18న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

విశాఖపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈ నెల 18న నిర్వహించనున్నట్టు సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఆ రోజు ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు ఒకటి నుంచి ఏడు సంఘ సమావేశాలు జరగనున్నట్లు చెప్పారు. సభ్యులు, అధికారులు సమావేశాలకు హాజరుకావాలని సూచించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	102.00
లైవ్ ధర	122.00
విత్ స్కిన్	214.00
స్కిన్ లెస్	224.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

పారిశ్రామిక విప్లవం

... 3వ పేజీ తరువాయి

ఏర్పాటు చేశారు. ఈ పనులన్నీ వచ్చే ఏడాది డిసెంబరునాటికి పూర్తిచేస్తారు. రోజూ ఎనిమిది కోట్ల లీటర్ల సముద్ర జలాలను (రెండు కిలోమీటర్ల దూరంలో వున్న బంగాళాఖాతం నుంచి) డీశాలినేషన్ చేసి హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేస్తారు. రోజుకు 1,500 టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌తోపాటు 7,500 టన్నుల గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ యూరియా, గ్రీన్ మెథనాల్, సస్టెయినబుల్ ఏవియేషన్ ఇంధనం ఉత్పత్తి అవుతాయి. ఏటా 2.5 మిలియన్ టన్నుల గ్రీన్ కెమికల్స్ ఉత్పత్తి అవుతాయి. పలు దేశాలకు ఇక్కడి నుంచి హైడ్రోజన్‌ను ఎగుమతి చేస్తారు. గ్రీన్ హైడ్రోజన్‌ను పరిశ్రమలు, రవాణా, విద్యుత్ ఉత్పత్తి రంగాల్లో వినియోగించడం ద్వారా పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది. ఇది పూర్తిగా అందుబాటులోకి వస్తే ఏటా 20 గిగావాట్ల గ్రీన్ హైడ్రోజన్, 2.5 మిలియన్ టన్నుల గ్రీన్ కెమికల్స్ ఉత్పత్తి అవుతాయి. గ్రీన్ హైడ్రోజన్ హబ్ నిర్మాణం పూర్తయితే (2032 నాటికి) ప్రత్యక్షంగా, పరోక్షంగా 57 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

ఔషధ రంగంలో కొత్త శకం

విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగమైన నక్కపల్లి క్లస్టర్‌లో ఏపీఐఐసీ గతంలో వేంపాడు, బుచ్చిరాజుపేట, రాజయ్యపేట, చందనాడ, డీఎల్‌పురం గ్రామాల్లో సేకరించిన సుమారు రెండు వేల ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కానున్నది. 'ఆంధ్రప్రదేశ బల్క్ డ్రగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్' రూ.1,876 కోట్లతో అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తుంది. కామన్ ఎఫ్ల్యుయంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఆవిరితో విద్యుత్ ఉత్పత్తి చేసే కేంద్రం, సాల్వెంట్ రికవరీ సిస్టమ్స్, ఎనలిటికల్ టెస్టింగ్ ల్యాబ్‌లు, గోదాములు, లాజిస్టిక్స్, విద్యుత్తు, నీరు, డ్రైనేజీలు, రోడ్లు, తదితర పనులు వచ్చే ఏడాది మార్చినాటికి పూర్తిచేయాలని లక్ష్యం. దేశ, విదేశాలకు చెందిన ఫార్మా కంపెనీలు ఇక్కడ దాదాపు 14 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నాయి. ప్రస్తుతం మన దేశంలో వున్న ఫార్మా కంపెనీల్లో కొన్ని రకాల ఔషధాలను, మందులను తయారు చేయడానికి అవసరమైన ముడిసరకును దిగుమతి చేసుకుంటున్నాయి. నక్కపల్లిలో ఏర్పాటు చేయనున్న బల్ డ్రగ్ పార్క్‌లో వీటిని ఉత్పత్తి చేసుకుంటే విదేశీమారక ద్రవ్యం ఆదా కావడంతోపాటు ఆయా ఔషధాల ధరలు ప్రజలకు అందుబాటులో వుంటాయి. బల్ డ్రగ్ పార్క్‌లో ఏర్పాటయ్యే ఫార్మా కంపెల్లో సుమారు 30 వేల మంది ఉద్యోగాలు, ఉపాధి లభిస్తాయి.

మహిళా రైతు దారుణ హత్య

... 3వ పేజీ తరువాయి

జరిగింది. ఇప్పుడు లక్కవరంలో ఇదే తరహాలో హత్య జరగడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నది. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగకార్తీక్, ఏఎస్ఐ శ్యామల ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గురువారం రాత్రి అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, పోలీసులతో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీమ్ వెళ్లి ఆధారాలను సేకరించింది. ఈ దారుణానికి పాల్పడింది ఒక్కరేనా? అంతకన్నా ఎక్కువ మందా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేటజంగాలపాలెంలో అక్రమ మైనింగ్

... 3వ పేజీ తరువాయి

స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్, అనకాపల్లి తహసీల్దారు పేర్లతో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డుల సాక్షిగా నల్లరాయిని అక్రమంగా తరలించుకుపోతున్నారు. కాగా వేటజంగాలపాలెం క్వారీల నుంచి ఈసీ లేకుండా నల్ల రాయి తవ్వకాలు, రవాణా గురించి మైన్స్ ఏడీ శ్రీనివాసరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. అన్ని క్వారీలకు అనుమతులు ఉన్నాయని అన్నారు. ఎన్ని క్వారీలకు ఈసీలు ఉన్నాయని అడగ్గా.. ఇప్పటికిప్పుడు చెప్పలేనని, ఫిర్యాదు ఇస్తే అప్పుడు పరిశీలిస్తానని చెప్పారు.

అదుపులోకి రాని అతిసార

... 3వ పేజీ తరువాయి

గురయ్యారు. వీరిలో బాగా నీరసంగా వున్న నలుగురు వేములపూడి పీహెచ్‌సీలో, ఏడుగురు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. డీఎంహెచ్‌వో రవికుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ప్రశాంతి గురువారం పీహెచ్‌సీకి వచ్చి బాలికల ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు.

డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు బుధవారం రాత్రి వేములపూడి వచ్చి బాధిత విద్యార్థినులను పరామర్శించారు. పాఠశాలలో వాటర్ ట్యాంకు, పరిసరాలు, వంటశాలను పరిశీలించారు. విద్యార్థినుల అస్వస్థతకు కారణం ఏమిటన్న దానిపై ఆరా తీశారు.

విద్యా శాఖ ఆర్‌జేడీ బి.విజయభాస్కర్, డిప్యూటీ డీఈవో అప్పారావు, తహసీల్దార్ రామారావు, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. కేజీబీవీలో తాగునీరు, విద్యార్థినుల విరేచనం నమూనాలను కేజీహెచ్‌లోని వైరాలజీ ల్యాబ్‌కి పంపించారు. విద్యార్థినుల అస్వస్థతకు కారణం ఏమిటన్నది రిపోర్టులు వచ్చిన తర్వాత వెల్లడిస్తామని అధికారులు అంటున్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీ

... 3వ పేజీ తరువాయి

రూ.650 ఉండగా, 16, 17 తేదీల్లో ఏసీ స్లీపర్ రూ.1,500 నుంచి రూ.2,500 వరకూ పెంచేశారు.

హైదరాబాద్ వెళ్లేందుకు విశాఖ నుంచి ఈనెల ఏడు వరకు ఏసీ స్లీపర్ రూ.1500 నుంచి రూ.రెండు వేలు, నాన్ ఏసీ రూ.1060-1,500 ఉండగా, వీటి ధరలను 15,16 తేదీల్లో ఏసీ స్లీపర్ రూ.3,200 నుంచి రూ.5,800కి పెంచేశారు. బస్సుల కేటగిరీని బట్టి నాన్ ఏసీ స్లీపర్ రూ.2,500 నుంచి రూ.3,200కి పెంచేశారు. వీటితోపాటు విజయవాడ నుంచి తిరుగు ప్రయాణాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి, 16,17 తేదీల్లో ఏసీ స్లీపర్ టిక్కెట్ రూ.1,500 నుంచి 2,500 మధ్య ఉంది. నాన్ ఏసీ స్లీపర్ రూ.1,500, అదే నాన్ ఏసీ చైర్ అయితే రూ.970 నుంచి రూ.1,100 మధ్య పెంచడం విశేషం. విశాఖ నుంచి ప్రతిరోజూ విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు 54 ట్రావెల్స్ సంస్థలకు చెందిన 110 బస్సులు వెళుతుంటాయి. పండుగ సీజన్‌లో వీటి సంఖ్య కొంతవరకూ పెరుగుతుంది. ఈ లెక్కన సంక్రాంతి సీజన్‌లో వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రతిరోజూ మూడు వేల మంది నగరానికి వస్తారు. వీరంతా పండుగ తర్వాత తిరుగు ప్రయాణాలు చేయాల్సి ఉంటుంది. అందరిపైనా టిక్కెట్ పెంపు భారం పడుతుంది. ప్రైవేటు ట్రావెల్స్ చార్జీలను పెంచేయడం దిగువ, మధ్యతరగతికి చెందినవారికి పెద్దసమస్యగా మారింది. దీనిపై రవాణా శాఖ అధికారులు దృష్టిసారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎక్కువ వసూలు చేస్తే చర్యలు

ఆదినారాయణ, రవాణా శాఖ డీసీ

ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో రేట్లు...ఆర్టీసీ చార్జీలకు సమానంగా ఉండాలి. అంతకు మించి వసూలుచేస్తే చర్యలు తీసుకుంటాం. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు రేట్లు పెంచుతున్నారనే ప్రచారం నేపథ్యంలో నియంత్రణకు కార్యాచరణ రూపొందించాం. ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులతో శుక్రవారం సమావేశం ఏర్పాటుచేస్తున్నాం. అధిక చార్జీలు వసూలుచేస్తే జరిమానాలు విధిస్తాం. ప్రత్యేక బృందాలతో బస్సుల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తాం.

వేంకటేశ్వరస్వామి అంటే అతనికి ఎంతో భక్తి

... 3వ పేజీ తరువాయి

వారి కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ సందర్భంగా వెంకటరమణ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, నాయుడుబాబుకు మూడేళ్ల వయసున్నప్పుడు తమ తల్లి చనిపోయిందని, అప్పటి నుంచి అన్నీ తానై పెంచి పెద్ద చేశానని కన్నీంటిపర్యంతం అయ్యారు. ఏడుకొండలవాడడంటే నాయుడుబాబుకి ఎంతో భక్తి అని, ఏటా నాలు గైదుసార్లు తిరుమల వెళ్లి స్వామివారిని దర్శనం చేసుకుని వస్తుంటాడని, చివరకు ఆయన సన్నిధిలోనే ప్రాణాలు వదిలాడని ఆయన వాపోయారు.

విశాఖకు చెందిన ముగ్గురి మృతి

ఇదే తొక్కిసలాటలో విశాఖ నగరానికి చెందిన ముగ్గురు మహిళలు మృతిచెందారు. రైల్వే న్యూ కాలనీలోని వెంకటేశ్వర కాలనీ ప్రాంతానికి చెందిన సూరిశెట్టి లావణ్య స్వాతి (38), కంచరపాలెం గాంధీనగర్ వాసి కండిపిల్లి శాంతి (35), మద్దిలపాలెం రామాలయం వీధికి చెందిన గుడ్ల రజని (47) మృతిచెందినట్టు గురువారం ఉదయం వారి బంధువులకు సమాచారం వచ్చింది.